

దాచుకున్న సొమ్ముకూ.. దిక్కు లేదు!



- ఆపత్కాలంలో ఆదుకోని జీపీఎఫ్ నిధులు
- లోను పెట్టుకుని నెలలు గడిచినా దక్కని దుస్థితి
- వడ్డీలకు తెచ్చుకుని అప్పులపాలవుతున్న ఉద్యోగులు
- రెండేళ్లుగా సరండర్ లీవ్ బకాయిలు పెండింగ్
- మూడు డీఏ బకాయిలతో ఉద్యోగుల ఇక్కట్లు
- ఊసే లేని ఏపీజీఎల్ఐ వెబ్‌సైట్



గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు తమ భవిష్యత్ అవసరాల కోసం, భద్రత కోసం ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్ రూపంలో నగదు దాచుకుంటారు. పండుగలు, శుభకార్యాలు, ఇతర అత్యవసరాలకు, ఆపత్కాల సమయంలో ఆ దాచుకున్న డబ్బులో నుంచి కొంత రుణం పొంది అవసరాలను నెట్టుకుపోవచ్చన్న కారణంగా ఉద్యోగులు కాస్త స్థిమితంగా ఉంటారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారి పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. ఉద్యోగులు దాచుకున్న గవర్నమెంట్ ప్రావిడెంట్ ఫండ్, ఉపాధ్యాయులు దాచుకున్న జెడ్పీ ప్రావిడెంట్ ఫండ్ నిధులను రూ.19వేల కోట్లను ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో ఉద్యోగులు దాచుకున్న సొమ్ముపై రుణాన్ని కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఉద్యోగులు రుణాలకు దరఖాస్తు చేసుకోవడమే తప్ప, ఆ రుణం ఎప్పుడు మంజూరవుతుందో కూడా తెలియని పరిస్థితి వారిది. దాదాపు తొమ్మిది నెలల క్రితం ఒక మారు రుణాలు మంజూరు చేసిన ప్రభుత్వం, ఆ తరువాత దరఖాస్తు చేసుకున్నవారికి రుణాలు మంజూరు చేయలేదు. దీంతో గడిచిన 9 నెలలుగా వారికి నిరీక్షణ తప్పలేదు. సుమారు వెయ్యిమంది ఉద్యోగులు జిల్లాలో రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యోగుల నుంచి ఒత్తిడి పెరగడం, మరో మూడు నెలల్లో ఎన్నికలు వస్తుండడంతో కంటి తుడుపు చర్యగా ప్రభుత్వం నామమాత్రంగా కొందరికి రుణాలు మంజూరు చేసి మమ అనిపించింది. కాగా మెజారిటీ ఉద్యోగులు ఇప్పటికీ రుణాల కోసం ఎదురు చూస్తున్నారు.

3 డీఏలు పెండింగ్..

పీఆర్సీ జరిగిన తరువాత ఇప్పటికి 3 డీఏలు పెండింగులో వున్నాయి. తొలి డీఏకి సంబంధించి 18 నెలలు, రెండో డీఏకి సంబంధించి 12 నెలలు, మూడో డీఏకి సంబంధించి 6 నెలలుగా ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉంది. వాటిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పీఆర్సీ పేరుతో అప్పటికే వున్న వేతనాలను తగ్గించిన ప్రభుత్వం డీఏలను బకాయి పెట్టడంతో ఉద్యోగులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఏడాదిన్నర కాలంగా డీఏ బకాయిలను చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వ తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డీఏ బకాయిలు విడుదల చేయకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

సెరెండర్ లీవ్స్ పరిస్థితి ఏంటి?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వున్నారు. వారిలో ప్రభుత్వ ఉద్యోగులకు ఏటా 30, ఉపాధ్యాయులకు ఏటా 6 ఎర్న్‌డ్ లీవ్స్ ఉంటాయి. వాటిని వినియోగించుకోని ఉద్యోగులు వాటిని ప్రభుత్వానికి సరండర్ చేసి వేతనాలు పొందుతారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అవీ ప్రశ్నార్థకంగా మారాయి. ఉద్యోగులు సెలవులైతే సెరండర్ చేస్తున్నారుగానీ ప్రభుత్వం వారికి చెల్లించాల్సిన వేతనాన్ని ఇవ్వడం లేదు. గడిచిన రెండేళ్లగా ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 4వేల కోట్ల మేర సరండర్ లీవ్స్ బకాయిలు వున్నట్లు ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు. వాటి ని తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

- గుంటూరు మండలానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు తన పీఎఫ్ నుంచి రూ.13 లక్షలు రుణం కావాలని కిందటేడాది సెప్టెంబరులో దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటి వరకూ ఆయన రుణానికి సంబంధించిన ఊసే లేదు. అక్టోబరులో ఆయన పదవీ విరమణ కూడా చేశాడు. అయినా సరే ఆయనకు రుణమూ రాలేదు. పీఎఫ్ నగదూ రాలేదు. ఇప్పటికీ ఆయన ఆ నగదు కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.
- మరో ప్రభుత్వ ఉద్యోగి ప్రాణాంతక ఆరోగ్య సమస్యకు గురై ఆసుపత్రి పాలయ్యాడు. అత్యవసర వైద్యం కోసం అతడికి రూ.6 లక్షలు అవసరమయ్యాయి. జీపీఎఫ్ ఉంది కదా అని దరఖాస్తు చేసుకున్నాడు. కానీ రుణం మాత్రం రాలేదు. దీంతో బయట అప్పు తెచ్చు కుని ప్రాణాలు నిలబెట్టుకోవాల్సి వచ్చింది.

- ఇలా ఒకటి కాదు.. రెండు కాదు ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడిచిన 9 నెలలుగా వందల సంఖ్యలో ఉద్యోగులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

పత్తా లేని ఏపీజీఎల్ఐ..

ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే జీవిత బీమా(ఏపీజీఎల్ఐ) ఆచూకీ కూడా కనిపించడడం లేదు. దాదాపుగా 9 నెలల నుంచి వందలాది క్లెయిములు పెండింగులో వున్నాయి. ప్రస్తుతం ఏపీజీఎల్ఐ వెబ్‌సైటు కూడా అందుబాటులో లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఆరు నెలల క్రితం మెయిన్‌టెన్స్ పేరుతో వెబ్‌సైటును నిలిపివేసిన ప్రభుత్వం ఆ తరువాత దాని ఊసు ఎత్తడమే మానేసింది. దీంతో ఇప్పటికే మెచ్యూర్ అయిన ఇన్సూరెన్స్ క్లెయిములు, ఇన్సూరెన్సుపై తీసుకునే రుణాల దరఖాస్తులు 9 నెలలుగా అలానే పడివున్నాయి.



- గుట్టుచప్పుడు కాకుండా వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచేసిన ప్రభుత్వం
- మూడు నుంచి నాలుగు రెట్లు ఒకేసారి పెంపు
- 1955 హిందూ వివాహ రిజిస్ట్రేషన్ చట్టం సవరణ పేరుతో వడ్డింపులు
- రిజిస్ట్రార్ ఫీజు రూ.1,100 నుంచి రూ. 5,000 పెంపు
- స్లాట్ బుకింగ్‌కూ రూ.200 నుంచి రూ.500కి పెంపు
- 2023 డిసెంబర్‌లో కొత్త జీఓ జారీ

పెళ్లి నమోదైనా.. బాదుడే

హిందూ వివాహ చట్టాన్ని జనం అభిప్రాయాల మేరకు మార్పులు చేస్తున్నామంటూ... డిజిటలైజేషన్ పేరు చెప్పి వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులను ప్రభుత్వం ఒకేసారి నాలుగు రెట్లు పెంచేసింది. ఈ మేరకు గత ఏడాది డిసెంబర్ 22న 609 జీఓను గుట్టుచప్పుడు కాకుండా విడుదల చేసేసింది. ఆన్‌లైన్‌లో వివాహ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి, స్లాట్ బుక్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నవారు ఒకేసారి భారీగా ఫీజులు పెంచేసిన తీరుచూసి విస్తుపోతున్నారు. అదేమంటే వివాహ వేడుకలకు భారీగా ఖర్చు చేస్తున్నవారు ఆమాత్రం ఫీజులు కట్టలేరా అంటూ ప్రభుత్వ పెద్దలు సమర్థించుకోవడం విశేషం.

ఫీజులు పెంచేశారిలా..

చలానా ఫీజు రూ.200కు బదులు ఏకంగా ఒకేసారి రూ.500కు పెంచేశారు. దంపతులు అందించే సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్‌కు గతంలో రూ.10 చెల్లిస్తే దానిని ఇప్పుడు రూ.100 చేశారు. రికార్డుల తనిఖీ వంటివాటికి కూడా గతంలో రూ.10, ప్రస్తుత సంవత్సరం కాకుండా ప్రతి గత సంవత్సరాలకు రూ.10 చొప్పున చెల్లించాల్సిఉండేది. కానీ ఇదికూడా రూ.100 చేసేశారు. వీటి పరిస్థితి ఇట్లా ఉంటే.. వివాహం చేసుకుంటున్న కళ్యాణ మండపానికో, గుడి దగ్గరకో రిజిస్ట్రార్ వచ్చి వివాహ రిజిస్ట్రేషన్ చేస్తే, దీనికి రిజిస్ట్రార్ ఫీరు రూ.1,100 చెల్లించాల్సి ఉండేది. దీనికి ఏకంగా రూ.5వేలకు పెంచేశారు. పైగా సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ చెయ్యాలంటే మరో రూ.5,000 చెల్లించుకోవలసిందే. ఇది కేవలం రికార్డుల ప్రకారం అధికారిక చెల్లింపులు మాత్రమే.

తెనాలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): హిందూ వివాహ చట్టం 1955ను 1965లో ఒకసారి, మధ్యలో స్వల్ప సవరణలు చేసినా ఫీజులు మాత్రం గత ప్రభుత్వాలు పెంచనేలేదు. కానీ జగన్ సర్కారు వచ్చాక వరుస వడ్డనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అన్ని శాఖల తరహాలో వివాహ రిజిస్ట్రేషన్‌ల విభాగంపైనా ప్రభుత్వం కన్నుపడింది. గతంలోఉన్న ఫీజులను మాత్రమే మార్పులు చేస్తూ కొత్త జీఓను గత ఏడాది డిసెంబర్‌లో విడుదల చేసింది హిందూ వివాహాలు సాధారణంగా దేవాలయాల్లో, మండపాల్లో, లేక ఇళ్ల దగ్గర బంధువుల సమక్షంలో జరుపుకోవటం ఆనవాయితీ, మరికొందరు ఇటువంటి ఆడంబరాలు ఏమీ లేకుండా రిజిస్ట్రార్ సమక్షంలో సంబంధిత కార్యాలయంలోనే వివాహం చేసుకోవటం కూడా ఎప్పటి నుంచో ఉంది. బయట వివాహాలు చేసుకుని తమ వివాహాన్ని చట్టబద్ధం చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవటం కూడా పరిపాటే. దీనికోసం గతంలో రిజిస్ట్రేషన్ దరఖాస్తుతోపాటు రూ.200 చలానా తీయటం, దంపతులు అందించే ధ్రువీకరణ పత్రాల పరిశీలన, రికార్డుల పరిశీలన వంటి వాటికోసం రూ.50 వరకు చెల్లించటం జరిగేది. ఒకవేళ వివాహం చేసుకుంటున్న కళ్యాణ మండపం, లేక దేవాలయానికే రిజిస్ట్రార్ నేరుగా వచ్చి వివాహాన్ని రిజిస్టర్ చేయాలంటే రూ.1,100 రిజిస్ట్రార్ ఫీజు చెల్లించాల్సి ఉండేది. కానీ వీటన్నిటినీ ఇప్పుడు మూడు నుంచి పది రెట్ల వరకు పెంచేసింది ప్రభుత్వం.

అనధికార వసూళ్లు సరేసరి..

పాత ఫీజులున్నప్పుడే మధ్యవర్తులు వివాహ రిజిస్ట్రేషన్ చేయించినందుకు తమకు, సిబ్బంది లంచాలపేరు చెప్పి రూ.4వేలు వసూలు చేసేవారు. కానీ ఇప్పుడు ఫీజులే భారీగా పెంచేయటంతో ప్రస్తుతం రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు అనధికార వసూళ్లు చేస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం ఈ ఫీజులన్నీ పెంచేయటంతో తాముకూడా దళారీ ఫీజులు పెంచేయాలనే ఆలోచనలో ఉన్నారని, అయితే జీఓ వచ్చి నెలరోజులు మాత్రమే కావటంతో ఎంత పెంచాలనే విషయంలో ఆలోచన చేస్తున్నారని సమాచారం. అంటే ప్రభుత్వం పెంచిన ఫీజులే భారీగా ఉంటే, అనధికారికంగా వసూళ్లు కూడా పెంచేస్తే కొత్త జంటలకు వివాహ చట్టభద్రత ఇక భారమే అయ్యే పరిస్థితి.

డిజిటలైజేషన్ పేరుతో బాదుడే...

హిందూ వివాహ రిజిస్ట్రేషన్ చట్టాన్ని మార్పులు చేస్తున్నట్టు 609 జీఓలో పేర్కొన్న ప్రభుత్వం డిజిటలైజేషన్‌కు సంబంధించి మార్పులు మాత్రం పెద్దగా ఏమీచేయలేదు. ఇప్పుడు డిజిటల్ ధ్రువీకరణ పత్రాలు వచ్చినా, ఇంకా నకళ్లు అడుగుతుండటం విశేషం, ఫారం-ఎ గతంలోనూ అందించాల్సి ఉండేది. అయితే ఇప్పుడు స్లాట్ బుక్ చేసుకున్నాక ఫారం-ఎను ఆన్‌లైన్‌లో నింపటం ఒక్కటే కాకుండా, డౌన్‌లోడ్ చేసి, మళ్లీ వాటికి ఇతర ధ్రువపత్రాలను జతచేసి ఇవ్వాల్సిన పరిస్థితి. మరో విశేషమేమంటే... హిందూ వివాహ చట్టం రూల్స్ మార్చేందుకు ఒక కమిటీని వేశామని, ఆ కమిటీ ముందు జనం వివరించిన అభిప్రాయాలు, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని చట్ట సవరణ చేసినట్టు ప్రభుత్వం పేర్కొంది. అయితే జనాభిప్రాయంలో ఎవరూ ఫీజుల పెంపు సూచనలు చేయటం వాస్తవ విరుద్ధమే.



బాపట్లలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

కొనసాగుతున్న ఆందోళన

- విధుల్లోకి చేరమని తీవ్ర ఒత్తిడి
- లెక్కచేయని అంగన్‌వాడీలు

బాపట్ల, జనవరి 21: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ 41 రోజులుగా సమ్మె చేస్తున్నారు. సమ్మె చేస్తున్న వారిని విధుల్లోకి చేరమని అధికారులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసిన ఐసీడీఎస్ అధికారులు విధుల్లోకి చేరకపోతే టెర్మినేషన్ ఆర్డర్స్ ఇచ్చి కొత్తవారిని నియమిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో నియోజకవర్గంలో 75 మంది విధుల్లో చేరారు. కొందరు చేరేందుకు సిద్ధపడుతున్నారు. బాపట్ల ప్రాజెక్ట్ పరిధిలో 253 కేంద్రాలుండగా వర్కర్స్, హెల్పర్స్ మొత్తం 506 మంది ఉన్నారు. ఐసీడీఎస్ పీడీ ఆదేశాల మేరకు సీడీపీవోలు, సూపర్‌వైజర్‌లు వీరిని భయపెడుతున్నారు. ఉద్యోగంలో జాయిన్ కాకపోతే తొలిగించటం ఖాయమని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ వారు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఛలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనేందుకు అనేక మంది బయలుదేరి వెళ్లారు. పోలీసులు విజయవాడ వెళ్లకుండా ఆపేందుకు నోటీసులు జారీ చేస్తున్నట్లు సమాచారం. అధికారులు మాత్రం కౌన్సెలింగ్ ఇస్తూనే జాయిన్ కాకపోతే ఉద్యోగాలు ఊడిపోతాయంటున్నారు. ఈ విషయమై సీడీఎస్ పీడీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు. సీడీపీవో శైలజను వివరణ కోరగా టెర్మినేషన్ ఆర్డర్స్ సిద్ధం చేశామని ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే అందజేస్తామన్నారు.

చలో విజయవాడకు అనుమతి లేదు : ఎస్పీ

అంగన్‌వాడీలు సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి పోలీస్ శాఖనుంచి ఎలాంటి అనుమతి లేదని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేనందున జిల్లాలోని అంగన్‌వాడీలు ఆ కార్యక్రమానికి వెళ్లొద్దని సూచించారు. జిల్లాలోని ముఖ్యమైన మార్గాలలో ఇప్పటికే చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, బస్టాండ్, రైల్వే స్టేషన్ ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు



కారంచేడు, స్వర్ణల మధ్య కొమ్మమూరు కాలువ కట్టకు పడిన గండికి తాత్కాలిక మరమ్మతులు చేసిన దృశ్యం

కడగండ్లు

- గండ్లు పూడిస్తేనే గట్టెక్కేది..!
- కనీస మరమ్మతులు కూడా చేపట్టని దుస్థితి
- బెట్టకొచ్చిన మాగాణి
- ఉన్న పంటను కాపాడుకునేందుకు...
- కొమ్మమూరు ఆయకట్టు రైతుల భగీరథయత్నం

చీరాల, జనవరి 21: ఇటీవల వచ్చిన తుఫాన్ నేపథ్యంలో కొమ్మమూరు కాలువకు పడిన గండ్లకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి సాగునీరు అందిస్తేనే తాము గట్టెక్కేదని, లేదంటే తీవ్రంగా నష్టపోతామని కొమ్మమూరు ఆయకట్టు రైతులు వాపోతున్నారు. 2006వ సంవత్సరంలో వచ్చిన తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలకు కొమ్మమూరు కాలువకు చిన్న, పెద్దవి కలిపి మొత్తం 70 గండ్లు పడ్డాయి. ఆ క్రమంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తరువాత ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో చేపడతామని ప్రకటన చేశారు. 2007లో మూడు ప్యాకేజీలుగా పనులను విభజించి టెండర్లు పిలిచారు. పనులను పొందిన కాంట్రాక్టరు కేవలం కొంతమేర (10శాతంలోపు) మట్టి పనులు చేసి, ఆ తరువాత కాడి కిందపడేశారు. ఒకటికి మూడు పర్యాయాలు ఈవోటీ (ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్) కూడా ఇచ్చారు. అయినా ప్రయోజనం లేదు. తరువాత బకింగ్‌హాం కెనాల్ ఆధునికీకరణ పేరుతో కొమ్మమూరు ఆధునికీకరణ పనులను, అందుకు సంబంధించిన ఫైలును పూర్తిగా అటకెక్కించారు.

కేడబ్ల్యూడీ(కృష్ణా వెస్ట్రన్ డెల్టా) కింద జిల్లాలోని పర్చూరు, కారంచేడు, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో అధికారికంగా, అనధికారికంగా సుమారు లక్ష ఎకరాల్లో మాగాణి సాగవుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ చివరి దశలో రైతులు వరి సాగు చేశారు. అప్పటికి ప్రభుత్వపరంగా సాగునీరు అందించలేమనే ప్రకటన చేయలేదు. ఆతరువాత వారబందీతో సాగునీరు ఇస్తామని కొద్ది రోజులు, అనంతరం సాగునీరు ఇవ్వలేమని చేతులెత్తేశారు. అప్పటికే నార్లు పోసుకుని, కొన్నిచోట్ల నాట్లు కూడా వేసిన పరిస్థితి. ఈక్రమంలో మిచౌంగ్ తుఫాన్ సర్వం ముంచింది. కొమ్మమూరు కాలువకు సుమారు 40 చోట్ల గండ్లు పడ్డాయి. సాగునీరు కొంత పంటలను ముంచగా, మరికొంత సముద్రం పాలైంది. ఈనేపథ్యంలో మరో పక్షం రోజులకు మాగాణికి నీటి తడులు అవసరం ఏర్పడింది.



కాలువ నుంచి ఆయిల్ ఇంజనుతో నీటిని పంప్ చేస్తూ..

ఎమ్మెల్యే చొరవతో కొంత కదలిక..

చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి దృష్టికి తమ సమస్యను సాగుదారులు తెచ్చారు. దీంతో ఆయన ఎస్ఈతో మాట్లాడారు. దీంతో ఈనెల మొదటి వారంలో వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వాస్తవానికి కాలువ పారుదల సామర్థ్యం మూడు వేల క్యూసెక్కులు కాగా 2500 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేయవచ్చు. కాలువ కట్టలు బలహీనంగా ఉండటం, పలుచోట్ల గండ్లకు తాత్కాలిక మరమ్మతులు చేస్తుండటంతో కేవలం వెయ్యి క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశారు. ప్రస్తుతం కాలువకు సాగునీరు ఆగింది. దీంతో దిగువ ప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పైరు కొన్నిచోట్ల కోత దశకు వస్తే మరికొన్నిచోట్ల పొట్టదశలో ఉంది. ఆ పైరును నీటి తడులు ఇచ్చేందుకు రైతులు భగీరథయత్నం చేస్తున్నారు. అయితే, మరమ్మతు పనులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో చేపట్టలేదు.

అంచనాలకే పరిమితమైన అధికారుల చర్యలు

తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలకు కొమ్మమూరు కాలువకు సంబంధించి గండ్లు, ఇతర మరమ్మతులకు సంబంధించి 33 ప్రదేశాలను గుర్తించారు. వాటి మరమ్మతులకుగాను రూ.78 లక్షలు వ్యయం అవుతుందని ప్రభుత్వానికి అంచనాల నివేదికను పంపారు. ఇదేమని అడిగిన రైతులు మరమ్మతులకు రూపాయి కూడా విడుదల కాలేదని స్థానిక అధికారులు చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో మాసం ఆగితే తాగునీటి చెరువులకు నీరు నింపాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కొమ్మమూరు ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మిర్చి రైతు గుండె కోత



పర్చూరు, యద్దనపూడి మధ్య మిర్చి పైరుకు నీటి తడికి ఏర్పాటు చేసిన ఇంజన్

- పడిపోతున్న ఎర్ర బంగారం ధరలు
- పెరుగుతున్న పెట్టుబడులు, తగ్గుతున్న దిగుబడులు
- మరలా తడుల కోసం తంటాలు

చీరాల, జనవరి 21: మిర్చి రైతు కంట కన్నీరు ఒలుకుతోంది. అనుకూల వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు ఓ వైపు, దిగజారుతున్న ధరలు, త గ్గుతున్న దిగుబడులు మరో వైపు.. దీనికి తోడు పెరిగిన పెట్టుబడులు.. వెరసి దిక్కుతోచని స్థితిలో మిర్చి రైతు ఆవేదన చెందుతున్నాడు.

పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,557 హెక్టార్లు, రబీలో 4,153 హెక్టార్లులో మిర్చి సాగు చేశారు. గతేడాది ఖరీఫ్‌లోనే సుమారు 4,500 హెక్టార్లలోను, రబీలో సుమారు 1,500 ఎకరాల్లోను మిరప సాగుచేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. దీంతో రబీలో అధికంగా సాగుచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ తరువాత వరుస వర్షాలు, తుఫాన్ల నేపథ్యంలో కురిసిన వర్షాలతో మిర్చి రైతులు కుదేలయ్యారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో నిండా మునిగారు. ప్రభుత్వ పరంగా అందిన సాయం శూన్యం. ఇదిలా ఉంటే ఓ వైపు దిగుబడులు, కాయల నాణ్యత కూడా తగ్గుతోంది. దీనికి తోడు ప్రస్తుతం మరలా రబీలో సాగుచేసిన రైతుల పైర్లు బెట్టకు వస్తున్నాయి. ఆ పైరుకు తడి ఇచ్చేందుకు సాగుదారులు భగీరథయత్నం చేస్తున్నారు. అదనంగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. సాధారణంగా అడుగుకాయలు కోసి విక్రయించగా వచ్చిన సొమ్మును పెట్టుబడిగా ఉపయోగించుకుంటూ మిగిలిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వచేస్తుంటారు. అయితే ప్రస్తుతం అడుగు పంట దిగుబడి అంతంత మాత్రంగా ఉంది. కోసిన కాయలకు కూడా సరైన ధర దక్కటం లేదు. గత ఏడాది క్వింటా రూ.19 వేల నుంచి రూ.23వేల వరకు పలికిన తేజ రకం ప్రస్తుతం రూ.14వేల నుంచి రూ.19వేల మధ్య ఉంది. 2043 రకం గత ఏడాది క్వింటా రూ.50వేల నుంచి రూ.60వేల వరకు పలికింది. అది ప్రస్తుతం రూ.20 మాత్రమే ఉంది. బాడిగ రకాలు గత ఏడాది రూ.22 వేల నుంచి రూ.23వేల వరకు ధర పలికితే ప్రస్తుతం రూ.12వేల నుంచి రూ.13వేల మధ్య ఉంది. ఇక నాటు రకాలు గత ఏడాది క్వింటా రూ.18 వేల నుంచి రూ.22వేల మధ్య ఉంటే ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.18వేల మధ్య మాత్రమే ధర పలుకుతున్నాయి. దీంతో లాభాలు అటుంచి పెట్టిన పెట్టుబడులు వస్తే అదే పదివేలని సాగు దారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మిర్చి కోతలు మొదలయ్యాయి. పెట్టుబడుల కోసం కొందరు అయినకాడికి తెగనమ్ముకుంటున్నారు. ఆర్థిక వెసులుబాటు ఉన్న కొందరు కోల్డ్ స్టోరేజీలో నిల్వచేసే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మిర్చి రైతుల కడగండ్లపై ప్రత్యేక దృష్టి సారించి గిట్టుబాటు ధర లభించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని సాగుదారులు కోరుతున్నారు.



కల్లంలో ఆరబోసిన మిర్చి

దిక్సూచి DIKSUCHI



పార్ట్-1

లెటర్ సిరీస్

పోటీపరీక్షల ప్రత్యేకం

1. PQR/ RPQ/ QRP/ PQR

మొదటి సమూహంలో చివరి అక్షరం రెండో సమూహంలో మొదటి అక్షరంగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో రెండో , మూడో అక్షరాలుగా ఏర్పడ్డాయి.. అదేవిధంగా రెండో సమూహంలో చివరి అక్షరం మూడో సమూహంలో మొదటి అక్షరంగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో రెండో, మూడో అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

2. PQ/ PPQ/ PPPQ/ PPPPQ

మొదటి సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'P' అదనంగా వస్తున్నది.

3. abcd/ aabbccdd/ aaabbbccc

మొదటి సమూహంలో ఒక abcd, రెండో సమూహంలో రెండు a లు, రెండు bలు, రెండు cలు, రెండు dలు ఒక సమూహంగా ఏర్పడింది. మూడో సమూహంలో మూడు aలు, మూడు bలు, మూడు cల వరకు ఈ సిరీస్ ఏర్పడింది.

4. baac/ accb/ cbba/ baac/ accb

మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో ఒకటో, రెండో అక్షరాలుగా, రెండో అక్షరమే మరల మూడో అక్షరంగా, నాలుగో అక్షరంగా దాని ముందు సమూహంలోని మొదటి అక్షరం ఏర్పడ్డాయి. అదేవిధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలోని ఒకటో, రెండవ అక్షరాలుగా, రెండో అక్షరమే తిరిగి మూడో అక్షరంగా, నాలుగో అక్షరంగా దాని ముందు సమూహంలోని మొదటి అక్షరం ఏర్పడింది. ఈవిధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

5. ccacc/ aabaa/ bbcbb/ ccacc

మొదటి సమూహంలో నాలుగు cలు, రెండో సమూహంలో నాలుగు aలు, మూడో సమూహంలో నాలుగు bలు ఏర్పడుతూ మొదటి సమూహంలోని నాలుగు అక్షరాలకు మధ్యగా a. రెండో సమూహంలో నాలుగు అక్షరాలకు మధ్యగా b, మూడో సమూహంలో నాలుగు అక్షరాలకు మధ్యగా c. ఈవిధంగా కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

6. PQR/ QRST/ RSTUV/ STUVWX

మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో అయిదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో ఒకటో, రెండో అక్షరాలుగా ఏర్పడి అదనంగా రెండు అక్షరాలు వర్ణమాలను(ఆల్ఫాబెట్స్) అనుసరిస్తూ ఏర్పడ్డాయి. రెండో సమూహంలోని చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలోని మొదటి మూడు అక్షరాలుగా ఏర్పడి అదనంగా రెండు అక్షరాలు వర్ణమాల ప్రకారం ఏర్పడినవి. అదేవిధంగా మూడో సమూహంలోని చివరి నాలుగు అక్షరాలు నాలుగో సమూహంలో మొదటి నాలుగు అక్షరాలుగా ఏర్పడుతూ అదనంగా రెండు అక్షరాలు వర్ణమాల ప్రకారం ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

7. aabc/ bbca/ ccab/ aabc

పై సిరీస్‌లో అండర్‌లైన్ చేసిన అక్షరాలు abc/ bca/ cab/ abc-లకు 11వ మోడల్‌కు సంబంధించిన వివరణే. అంతేకాక ప్రతి సమూహంలోను మొదటి అక్షరమే రెండుసార్లు రిపీట్ అయినది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

అదానీ Vs హిండెన్‌బర్గ్

ఆరోపణలు - పరిణామాలు



భారతదేశం తొంభయ్యవ దశకంలో చేపట్టిన సంస్కరణలతో ఆర్థికరంగం సరికొత్త రూపుదాల్చింది. ఎల్‌పీజీ(లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్)ను ప్రవేశపెట్టడం ద్వారా దేశ ఆర్థికవ్యవస్థలో వృద్ధితోపాటు, కొన్ని అవలక్షణాలకు ద్వారాలు తెరిచినట్లయింది. మరీ ముఖ్యంగా వైట్‌కాలర్ నేరాలు(స్టాక్ మార్కెట్ కుంభకోణాలు, ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లు, మనీ లాండరింగ్, డొల్ల సంస్థలు, పన్ను ఎగవేతలు, రుణాల కుంభకోణాలు మొదలైన ఆర్థిక నేరాలు) విజృంభించాయి.

కొత్తగా అనుసరిస్తున్న ఆర్థికపంథాకు అవసరమైన నియంత్రణ సంస్థల, చట్టాలపరమైన కొరతకు తోడు ఇతర దేశాలతో ఆర్థిక నేరాల సమాచార మార్పిడి, నేరగాళ్ల అప్పగింత ఒప్పందాలు విస్తృతంగా లేనందున ఆర్థిక నేరాలను పసిగట్టడం, అదుపు చేయడం, నేరగాళ్లను శిక్షించడంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. అందువల్ల తరచూ ఏదో ఒక తరహా వైట్ కాలర్ నేరాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి.

ఇటీవల అదానీ గ్రూప్ సంస్థలపై అలాంటి వైట్‌కాలర్ నేరాలను ఆరోపిస్తూ అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లర్, ఆర్థిక నేరాల పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఒక పరిశోధన నివేదికను జనవరి 2023లో విడుదల చేసింది.

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలు

1. అదానీ గ్రూపునకు చెందిన పోర్ట్స్, లాజిస్టిక్, పవర్ జనరేషన్, అగ్రి బిజినెస్ వంటి వివిధ సంస్థలు స్టాక్ మార్కెట్ మ్యానిప్యులేషన్, అకౌంటింగ్ లొసుగులు, పన్ను ఎగవేతలు, ఫ్రాడ్ స్కీమ్‌లు వంటి చర్యల ద్వారా దశబ్దాల తరబడి సుమారు 17.8 ట్రిలియన్ల(218 బిలియన్ డాలర్ల) మేర అక్రమాలకు పాల్పడ్డాయి.
2. అదానీ కుటుంబ సభ్యులు మారిషస్, కరేబియన్ దీవులు, యుఏఈ వంటి టాక్స్‌హెవెన్(పన్ను రాయితీ/పన్నురహిత) దేశాల్లో షెల్ కంపెనీలు(డొల్ల కంపెనీలు) ఏర్పాటుచేసి అనేక అక్రమాలకు తెరలేపారు.
3. ఈ డొల్ల కంపెనీల ద్వారా భారీఎత్తున మనీ లాండరింగ్, అవినీతి, స్వదేశంలో పన్ను ఎగవేత జరిగాయి.
4. అదానీ గ్రూపులోని పబ్లిక్ లిస్టింగ్ కంపెనీల మధ్య నిధుల అక్రమ బదిలీ ఈ డొల్ల కంపెనీల ద్వారా జరిగింది.
5. షేర్ల విలువను తప్పుడు మార్గా ల్లో పెంచడం ద్వారా బ్యాంకుల నుంచి భారీఎత్తున రుణాలు, ఇతర సంస్థల నుంచి పెట్టుబడులు అదానీ పొందారు.

షార్ట్ సెల్లింగ్ అంటే ఏమిటి?

హిండెన్‌బర్గ్ సంస్థ షార్ట్ సెల్లింగ్‌కు పాల్పడేందుకే అదానీ గ్రూపు లొసుగులపై నివేదికను వెలువరించిందనే వాదనలూ ఉన్నాయి. షార్ట్ సెల్లింగ్ అంటే సాధారణంగా స్టాక్ మార్కెట్లలో సాధారణ ఇన్వెస్టర్లు, భవిష్యత్తులో షేర్ ధర పెరగవచ్చనే ఆశావాద దృక్పథంతో చేసే కొనుగోళ్లకు పూర్తిగా విభిన్నం అయిన ప్రక్రియ ఇది. ఒక ప్రయోజనంతో, ధరలు ఎక్కువగా ఉన్నప్పుడే అరువుగా ఆ షేర్లను తీసుకుంటారు. వాటిని అమ్మి, ఆ మొత్తంతో ధర పడిపోగానే భారీగా ఆ షేర్లు తిరిగి కొంటారు. ధర పెరిగినప్పుడు మరలా అమ్మి, లభించిన మార్జిన్‌తో భారీగా లాభ పడతారు. అలా అరువు తీసుకున్న షేర్లను తిరిగి వెనక్కి ఇచ్చేసే ప్రక్రియ ఇది. దీనిలో తక్కువ కాలానికి స్టాక్స్ ఉంచుకుంటారు.

19(ఎ) రూల్ అనగా?

'సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్(రెగ్యులేషన్) రూల్స్ 1957'లోని 19(ఎ) రూల్ ప్రకారం భారత స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన ప్రతి కంపెనీ కనీసం 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను కలిగి ఉండాలి. అంటే 75 శాతం మించి కంపెనీ యజమానులు కానీ వారి కుటుంబీకులు కానీ వాటాను కలిగి ఉండరాదు. ఈ నియమం ఇన్‌సైడర్ ట్రేడింగ్, షేరు ధరల్లో అవకతవకలకు పాల్పడటం వంటి వాటిని నిరోధించడానికి నిర్దేశించారు. షేర్ మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులో కొంతమొత్తం షేర్లు ఉంచడం ద్వారా ట్రేడింగ్ జరిగి షేర్ విలువల్లో కచ్చితత్వ సాధనకూ ఈ నియమాన్ని ప్రవేశపెట్టారు.

ఈ నివేదిక వెలువడటంతోనే దేశంలోనే సంపన్న వ్యక్తిగా నిలిచిన గౌతం అదానీ సంస్థల షేర్లు గత ఏడాది 150 బిలియన్ డాలర్ల మేర నష్టపోవడానికి, అతని వ్యక్తిగత సంపద 60 బిలియన్ డాలర్ల మేర తుడిచిపెట్టుకుపోవడానికి కారణమైంది. ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయారు. అదానీ కంపెనీలకు పెద్దమొత్తంలో రుణాలిచ్చిన బ్యాంకులు, పెట్టుబడులు పెట్టిన ఎల్‌ఐసీ సంస్థ షేర్లు అమాంతం పడిపోయాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు అదానీ సెక్యూరిటీ చట్టాల ఉల్లంఘనకు పాల్పడిందన్న హిండెన్‌బర్గ్ ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా మూలధన మార్కెట్ రెగ్యులేటింగ్ ఏజెన్సీ అయిన 'సెబీ(సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా)'ను 2023 మార్చిలో ఆదేశించింది. ఈ మేరకు సెబీకి సుప్రీంకోర్టు రెండు కీలక విషయాల పరంగా పరిశోధన జరపాలని టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఇచ్చింది. **అవి–**

1. సెక్యూరిటీస్ కాంట్రాక్ట్(రెగ్యులేషన్)రూల్స్ 1957లోని రూల్ 19(ఎ)ను అదానీ గ్రూపు సంస్థలు అతిక్రమించాయా?
2. స్టాక్ ప్రైసెస్ అవకతవకలు, అదానీ సంస్థల్లో రహస్య లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై పరిశీలన.

దీనితోపాటు సుప్రీంకోర్టు కూడా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఏ.ఎం.సప్రే అధ్యక్షతన ఆరుగురు సభ్యుల ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించి హిండెన్‌బర్గ్ రిపోర్టు తో ఇన్వెస్టర్లు సంపద కోల్పోవడానికి రెగ్యులేటరీ వైఫల్యం ఎంత ఉందో చెప్పాల్సిందిగా ఆదేశించింది.

ఈ క్రమంలో సెబీ దర్యాప్తుపై అనుమానాలు రేపుతూ ఫైనాన్షియల్ టైమ్స్, ద గార్డియన్ పత్రికల్లో ఆగస్టులో 'ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు(ఓసీసీఆర్‌పీ) వెలువరించిన రిపో ర్టు సంచలనం రేపింది. ఈ సంస్థ రిపోర్టు, హిండెన్‌బర్గ్ ఆరోపణలకు ఆధారాలను చూపెట్టింది. విదేశాల్లోని డొల్ల కంపెనీల ద్వారా ఏవిధంగా అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్స్‌లో రూల్ 19(ఎ)ను అతిక్రమిస్తూ రహస్యంగా 75 శాతానికి మించి వాటాను అదానీ కుటుంబం సంపాదించిందో అంతర్గత ఈమెయిల్స్, ఇన్వాయిస్‌లు, లావాదేవీల రికార్డులు సహితంగా ఆధారాలు ప్రచురించింది. అంతేకాక గతంలో అదానీ కంపెనీ జరిపిన కొన్ని అనుమానాస్పద లావాదేవీలను సెబీ నియంత్రణ చేయలేకపోవడం గతంలో సెబీ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి తదుపరి అదానీ గ్రూపు కొనుగోలు చేసిన ఎన్‌డీటీవీలో కీలక పదవి చేపట్టడం వంటి విషయాలు సైతం ఈ నివేదిక వెల్లడించింది. ఈ వార్తా కథనాలతో సెబీ దర్యాప్తుపై అనుమానాలు రేకెత్తించడంతో కొందరు అదానీ కేసులో సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) లేదా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాల్సిందిగా సుప్రీంకోర్టును కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు.ఈ వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం జనవరి 3న తీర్పు చెప్పింది.

సుప్రీంకోర్టు తీర్పులోని అంశాలు

1. సెబీ చేస్తున్న దర్యాప్తుపై ఎటువంటి అనుమానాలూ లేవని, అదనంగా సిట్‌ను గానీ, సీబీఐని గానీ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సెబీ సమగ్రతను శంకించలేమని పేర్కొంది.
2. ఇప్పటికీ విచారణ చేపట్టాల్సిన 22 అంశాల్లో 20 అంశాలపరంగా విచారణ పూర్తయిందని సెబీ తెలిపిన దరిమిలా మిగతా రెండు అంశాలపై కూడా మూడు నెలల్లోగా దర్యాప్తు పూర్తిచేసి నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించింది.
3. పిటిషన్‌దారులు కోరినట్లుగా, సెబీ ఇటీవల ప్రవేశపెట్టిన ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్స్ రెగ్యులేషన్, ద లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్స్ రిక్వైర్‌మెంట్ రెగ్యులేషన్ పరంగా ఎటువంటి మార్పులు చేయాలని సెబీని ఆదేశించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది.
4. హిండెన్‌బర్గ్ సంస్థ నివేదిక వెలువరించిన తరవాత భార త షేర్ మార్కెట్‌లో ఒడుదొడుకులను ఆసరాగా చేసుకొని షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ భారీగా కొనుగోళ్లు జరిపి లాభపడిందనే వార్తల వచ్చాయి. ఆ నేపథ్యంలో, హిండెన్‌బర్గ్ అవకతవకలకు పాల్పడిందేమో విచారించాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించింది. అయితే కొందరు విశ్లేషకులు మాత్రం సుప్రీంకోర్టు తీర్పు విషయంలో కొన్ని అంశాలపరంగా మరింత స్పష్టత ఆశిస్తున్నారు. **అవి–**

- సెబీ దర్యాప్తు పూర్తిచేసిన 20 అంశాల్లో ఏముందో ప్రజలకు గానీ, కనీసం సుప్రీంకోర్టు పరిశీలించడానికి గానీ సెబీ నివేదించలేదు. సుప్రీంకోర్టు కూడా వాటి వివరాలు కోరలేదు.
- దర్యాప్తు పూర్తిచేయాల్సి ఉన్న మిగతా రెండు విషయాలైన రూల్19(ఎ) అతిక్రమణకు సంబంధించి, అదానీ సంస్థ ల్లో పెట్టుబడి పెట్టిన విదేశీ సంస్థల యాజమాన్యాలు, వాటి లావాదేవీల గురించి హిండెన్‌బర్గ్ ఓసీసీఆర్‌పీ సేకరించిన వివరాలు, ఆధారాలు సెబీ ఎందుకు సేకరించలేకపోతోంది?
- టాక్స్ హెవెన్ దేశాల్లో ఆర్థిక సంబంధమైన సమాచార మార్పిడిపరంగా ఉన్న నిబంధనల కారణంగా మిగిలిన రెండు అంశాల్లో విచారణ ఆలస్యమవుతోందని సెబీ కోర్టుకు తెలిపింది. అయితే ఆ సమస్య పరిష్కార దిశగా సెబీ, సుప్రీంకోర్టు, ప్రభుత్వం ఎలాంటి పరిష్కార మార్గాలు, ప్రత్యామ్నాయ పద్ధతులు చూపకపోవడంతో కేసు విచారణ మూడు నెలల గడువులోగా పూర్తికావడంపై సందేహాలు ముసురుకుంటున్నాయి.
- సెబీ దర్యాప్తు ఆలస్యం అవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా చర్యలు తీసుకోవడానికి మార్గం సుగమం కావడంలేదు. ఈ పరిస్థితుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విధిని నిర్వర్తించేందుకు సెబీ కనీసం ప్రాథమిక దర్యాప్తు నివేదికనైనా బహిర్గతపరచాల్సి ఉంటుంది. నేరారోపణ ఉన్నట్లయితే మిగతా రెండు విషయాల కోసం కాలయాపన తగదు.

గతంలో ఇదేతరహా ఆర్థిక నేరాలకుగాను 15 సంవత్సరాల క్రితం సెబీ అదానీపై ఫిర్యాదు నమోదుచేసి, పదిలక్షల జరిమానా విధించింది. ప్రస్తుతం వివిధ బ్యాంకులు అదానీకి భారీగా రుణాలు ఇచ్చి ఉండటం, ఎల్‌ఐసీ అదానీ సంస్థల్లో 81,347 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టి ఉన్న నేపథ్యంలో ఒకవేళ నేరాలు రుజువై, అదానీ రుణాల చెల్లింపులో విఫలమైతే స్టాక్ మార్కెట్‌లో తీవ్ర ఒడుదొడుకులు నమోదవుతాయన్న భయాలు సర్వత్రా నెలకొన్నాయి.

అయితే ఈ తీర్పుతో సెబీ సమగ్రతపై సుప్రీంకోర్టు ధృవీకరణ ఇచ్చినట్లయింది. భారతదేశ విత్త మార్కెట్, రెగ్యులేటరీ మెకానిజాలపై ఇన్వెస్టర్లకు అభద్రతాభావం కలుగకుండా ఉండేందుకు ఇది దోహదపడింది.

ఇదిలా ఉండగా తీర్పు వెలువడిన వెంటనే గౌతమ్ అదానీ 'సత్యమేవ జయతే' అని ట్వీట్ చేయడం మాత్రం కేసులో ఆయన విజయం సాధించినట్లుగా భ్రమలు కల్పించే ప్రయత్నమేనని విమర్శకులు పేర్కొంటున్నారు. నిజానికి సెబీ కానీ, సుప్రీంకోర్టు కానీ ఆయనకు ఎటువంటి క్లీన్‌చిట్ ఇవ్వలేదు. కేవలం సెబీ సమగ్రతకు మాత్రమే సుప్రీంకోర్టు ధృవీకరణ దక్కింది. ●



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

బొత్స ఇంటిని ముట్టడిస్తాం

▸▸ నిరుద్యోగ జేఏసీ

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'మెగా డీఎస్సీ అంటూ వైసీపీ ప్రభుత్వం పదే పదే నిరుద్యోగులను మోసం చేస్తోంది. సంక్రాంతి పండగ తర్వాత నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటన చేశారు. ఆతరువాత కనీస స్పందన లేదు' అని జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిక్ ఓ ప్రకటనలో మండిపడ్డారు. 'నిరుద్యోగులు చేస్తున్న ఒత్తిడితో మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి ఏర్పడింది. వారిని మభ్యపెట్టడానికి ఉత్తుత్తి ప్రకటనలు చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోతే త్వరలో మంత్రి బొత్స ఇంటిని ముట్టడిస్తామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను రోడ్లపై తిరగనివ్వం' అని సిద్దిక్ హెచ్చరించారు.

రాజకీయాలకతీతంగా పనిచేస్తాం

▸▸ ఇంజనీరింగ్ కాలేజీల సంఘం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'రాజకీయ పార్టీలతో సంబంధం లేని వారిని సంఘం నేతలుగా ఎన్నుకోవడం ద్వారా సాంకేతిక కాలేజీల అభివృద్ధి జరుగుతుంది. విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి' అని ఏపీ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం పేర్కొంది. నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి మధుసూదన్‌రావు, కోశాధికారి గ్రంధి సత్యనారాయణ ఆదివారం విజయవాడలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మొదటి సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్న కళాశాలలు ఇతర కాలేజీలకు తోడ్పాటు ఇవ్వాలని, ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్‌తో సమన్వయం చేసుకుని కాలేజీలు ఆర్థికంగా మెరుగుపడేలా చూడాలని తీర్మానించినట్లు నేతలు తెలిపారు.

కారులో తరలిస్తున్న రూ.2.07 కోట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో నక్కపల్లి పోలీసులు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా), జనవరి 21: కారులో తరలిస్తున్న రూ.2.07 కోట్ల నగదును అనకాపల్లి జిల్లా నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. ఎస్‌ఐ విభీషణరావు ఆదివారం విలేకర్లకు వెల్లడించిన వివరాల మేరకు.. అనకాపల్లి జిల్లా ఎస్పీ, నర్సీపట్నం ఏఎస్పీ ఆదేశాలతోపాటు అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో నక్కపల్లి పోలీసులు శనివారం రాత్రి జాతీయ రహదారిపై వేంపాడు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో తుని వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న కారును ఆపి పరిశీలించారు. లోపల ఇద్దరు వ్యక్తులతోపాటు ఐదు బ్యాగులు కనిపించడంతో ఆ బ్యాగులను తెరిచి చూడగా పెద్ద మొత్తంలో నగదు బయటపడింది. తాము ధాన్యం వ్యాపారులమని, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట నుంచి నగదు తీసుకెళుతున్నామని కారులో ఉన్న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన వజ్రపు వెంకటేశ్వరరావు, యాదవ రాజు బదులిచ్చారు. అయితే ఎటువంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు బ్యాగుల్లోని రూ.2.07 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు సోమవారం అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

29 నుంచి ఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

విజయవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ పరిధిలో వచ్చే వార్షిక నివేదికపై ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు సీపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ సూర్యారావుపేటలోని సీపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ అభిప్రాయ సేకరణ ఉంటుందని తెలిపారు.





సీన్ మారుతోంది!

- ▸▸ రుతుపవనాలపై వాతావరణ మార్పు ప్రభావం
- ▸▸ దేశంలో 55 % తాలూకాల్లో 10 % పెరిగిన వర్షపాతం
- ▸▸ గంగా మైదానం, ఈశాన్య భారతంలో వర్షాభావం
- ▸▸ ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తమిళనాడు, తెలంగాణ, ఏపీలో మూడు జిల్లాల్లో పెరిగిన వర్షాలు
- ▸▸ వాతావరణ, పర్యావరణ నిపుణుల అధ్యయనంలో వెల్లడి


గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వల్ల ఎండిపోయిన వరి పైరు



డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ వర్షాలతో నీటిపై తేలుతున్న వరి పనలు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 'వాతావరణ మార్పు ప్రభావం' (క్లైమేట్ చేంజ్ ఎఫెక్ట్)తో వాతావరణ పరిస్థితుల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆకస్మికంగా కుంభవృష్టి వర్షాలు, వరదలు.. ఇదే సమయంలో తీవ్రమైన వర్షాభావంతో కరువు పరిస్థితులు, తీవ్ర వడగాడ్పులు వంటివి సంభవిస్తుండడంతో వాతావరణ, పర్యావరణ నిపుణులు తరచూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నైరుతి సీజన్‌లో వర్షాలు ఆలస్యమై ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం పడడంతో దిగుబడులు తగ్గుతుందన్న నిపుణుల హెచ్చరికల నేపథ్యంలోనే.. దేశంలో నైరుతి, ఈశాన్య రుతుపవనాల సీజన్‌లలో మార్పులు సంభవించాయని ఒక అధ్యయనం వెల్లడించింది. భారత వాతావరణ శాఖ నుంచి తీసుకున్న అంశాలపై స్వతంత్ర అధ్యయన సంస్థ 'ది కౌన్సిల్ ఆఫ్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (సీఈఈడబ్ల్యూ) 1982 నుంచి 2022 వరకు నిర్వహించిన ఈ అధ్యయనంలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. గడచిన దశాబ్ద కాలంలో (2012-2022) ఏర్పడిన వాతావరణ మార్పుల వల్ల నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో 5,650 తాలూకాలకుగాను 4,419 తాలూకాల్లో (55 శాతం) 10 శాతం వర్షపాతం పెరగగా 11 శాతం తాలూకాల్లో వర్షపాతం తగ్గింది. ముఖ్యంగా గత దశాబ్ద కాలంలో రుతుపవనాల కదలికలు, వాటి ప్రభావంలో అనేక మార్పులు వచ్చాయని గుర్తించారు. దేశంలో జూన్ నుంచి సెప్టెంబరు వరకు నైరుతి, అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈశాన్య రుతుపవనాల వల్ల వర్షాలు కురుస్తాయి. జూన్‌లో కేరళను తాకే నైరుతి రుతుపవనాల వల్ల కురిసే వర్షాలతో దేశంలో ఎండల నుంచి ఉపశమనం పొందడమే కాకుండా ఖరీఫ్ పంటల సాగుకు దోహదపడతాయి. ఈశాన్య రుతుపవనాలు దక్షిణ ద్వీపకల్పంలో రబీ పంటలతోపాటు తాగునీటి అవసరాలను తీరుస్తుంటాయి. క్లైమేట్ చేంజ్ వల్ల దేశంలో రుతుపవనాల మౌలిక స్వరూపంలో అనేక మార్పులు వచ్చాయని ఈ అధ్యయనం వెల్లడించింది. గడచిన 40 సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాల వర్షపాతం వివరాలను విశ్లేషిస్తే.. 29 ఏళ్లపాటు సాధారణంగా, తొమ్మిది సంవత్సరాలు సాధారణం కంటే ఎక్కువగా, మూడు సంవత్సరాలు తక్కువగా వర్షపాతం నమోదైంది. సంప్రదాయంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే రాజస్థాన్, గుజరాత్, మధ్య మహారాష్ట్ర, తదితర ప్రాంతాల్లో వర్షాలు పెరిగాయి. తమిళనాడులో 1981 నుంచి 2011 వరకు సాధారణం కంటే 30 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైంది. దేశంలో 55 శాతం తాలూకాల్లో వర్షపాతం శాతం పెరగడం, వరదలు సంభవించడం జరిగాయి. గత పదేళ్లలో 64 శాతం తాలూకాల్లో సగటున ఒకటి నుంచి 15 రోజులు అధిక వర్షాలు కురిశాయి. ఉదాహరణకు గత ఏడాది హిమాచలప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, 2022లో బెంగళూరులో సంభవించిన వరదలే ఇందుకు తార్కాణమని అధ్యయనంలో తేలింది. కాగా అత్యధిక వర్షాలు కురిసే అస్సాం, మేఘాలయల్లో వర్షపాతం తక్కువగా నమోదైంది. దేశానికి ధాన్యాగారంగా పేరొందిన గంగా మైదాన ప్రాంతం ప్రధానంగా పశ్చిమబెంగాల్ పరిసర ప్రాంతాల్లో నైరుతి సీజన్‌లో వర్షాలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ ప్రాంతంలో జూన్, జూలై నెలల్లోనే ఖరీఫ్ పంటలను సాగు చేస్తుంటారు. అయితే ఈ రెండు నెలల్లో వర్షాలు ఆలస్యం కావడంతో ఖరీఫ్ సాగులో జాప్యం ఏర్పడంతోపాటు పంటల దిగుబడి గణనీయంగా తగ్గింది. ఇది దేశంలో పంటల దిగుబడి అంచనాపై ప్రభావం చూపుతోంది. ఇదే సమయంలో ఆకస్మిక వరదలు లేదా వర్షాభావంతో కరువు పరిస్థితులు ఎక్కువగా సంభవిస్తున్నాయి. జూన్, జూలైలో వర్షాలు ఆలస్యం కావడంతో గంగా మైదాన ప్రాంతమే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఖరీఫ్ సాగు ఆలస్యమవుతోంది. ఇక అక్టోబరులో దేశంలో 48 శాతం తాలూకాల్లో 10 శాతానికిపైగా వర్షపాతం పెరగడంతో ఖరీఫ్‌లో చేతికి వచ్చిన పంటలు నష్టపోతుండడం, రబీ సాగు ఆలస్యం కావడం వంటివి జరుగుతున్నాయని అధ్యయనంలో వెల్లడైంది. గత పదేళ్లలో ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తమిళనాడులో 80 శాతం, ఆగ్నేయ తెలంగాణలో 44 శాతం, ఏపీలోని మూడు జిల్లాల్లో 39 శాతం వర్షపాతం పెరిగింది. ఇంకా ఒడిశా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, గోవాలో కూడా వర్షపాతం పెరిగిందని ఈ అధ్యయనం వెల్లడించింది.

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక



మాధవస్వామి, నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, జనవరి 21: ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళగిరిలో జరుగుతున్న మహాసభల సందర్భంగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుగిడె మాధవస్వామి, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి నాగేశ్వరరావు, కోశాధికారిగా బత్తూరి మోహన్‌రావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కడుపు కన్నయ్య, నీలూరి లక్ష్మయ్య, బి.వెంకట నారాయణ, జొన్నాదుల భారతి, సహాయ కార్యదర్శులుగా పామిశెట్టి గోవిందు, గొట్టుముక్కల బాలాజీ, పీ.హరి, వై.పీతాంబరధరరావు, మరో 35 మంది కౌన్సిల్ సభ్యులతో నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు చేనేత కార్మిక సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి జింకా చలపతి ప్రకటించారు.

ధర్మారం క్యాంపుపై మేమే దాడి చేశాం

▸▸ మావోయిస్టు నాయకురాలు సమత పేరుతో లేఖ

చర్ల, జనవరి 21: బీజాపూర్ జిల్లా పామేడులోని ధర్మారం సీఆర్పీఎఫ్ క్యాంపుపై తామే దాడి చేశామని మావోయిస్టులు ప్రకటించారు. ఈ మేరకు దక్షిణ సబ్-జోనల్ బ్యూరో ప్రతినిధి సమత పేరుతో ఆదివారం ఓ లేఖ విడుదలైంది. ఈ ఘటనపై ఇంతవరకు పోలీసులు మాట్లాడేందుకు నిరాకరించినా.. మావోయిస్టులు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. "ఈ నెల 16న ధర్మారం క్యాంపుపై భారీ దాడి చేశాం. పీఎల్‌జీఏ బలగాలు వీరోచితంగా పోరాటం చేశాయి. ఈ పోరులో చాలా మంది పోలీసులు మృతిచెంది ఉంటారు. పలువురు క్షతగాత్రులై ఉంటారు. వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చి సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్ వంటి విభాగాల్లో చేరి, ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. చనిపోయిన పోలీసుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నాం" అని సమత ఆ లేఖలో పేర్కొన్నారు. సుదీర్ఘంగా సాగిన ఈ పోరాటంలో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారని వివరించారు. మృతిచెందిన మావోయిస్టుల్లో పీఎల్‌జీఏ కమాండర్ కరటం దేవాల్, మూసాక విక్రమ్, మడకం దేవాల్ ఉన్నారని వెల్లడించారు.



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

అమరావతి అజరామరం

● 1496వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, జనవరి 21: దుర్మార్గపు మూడు ముక్కల ఆట ఆపేవరకు అమరావతి పోరు ఆగదని 33వేల ఎకరాలు రాజధానికి త్యాగం చేసిన రైతులు స్పష్టం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1496వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు, మహిళలు మాట్లాడుతూ సీఎం జగన్ అమరావతిని చంపేయాలని చూస్తున్నాడన్నారు. అమరావతి ఎప్పటికీ అజరామమేనన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా అమరావతి అభివృద్ధిని ఆపలేరన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆటను ఆపాలన్నారు. అమరావతే ఎప్పటికీ ఆంధ్రుల రాజధాని అని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి.

దళిత జేఏసీ కన్వీనర్ మార్టిన్‌కు కన్నీటి వీడ్కోలు



దళిత జేఏసీ కన్వీనర్ మార్టిన్ శవపేటికను మోస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్

తుళ్లూరు జనవరి 21: అమరావతి దళిత పోరాట యోధుడు గడ్డం మార్టిన్ లూథర్ బాబుకు పలువురు ప్రముఖులు, జేఏసీ నేతలు, స్థానిక ప్రజానీకం కన్నీటి వీడ్కోలు పలికారు. శనివారం ఓ ప్రైవేటు హాస్పటల్లో గుండెపోటుతో మార్టిన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం మందడంలో అంత్యక్రియలు నిర్వహించారు. అమరావతి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మార్టిన్ మృతదేహాన్ని మాజీ మంత్రులు, దేవినేని ఉమా, నక్కా ఆనందబాబు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, అమరావతి దళిత బహుజన అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, అమరావతి దళిత జేఏసీ నేత పులి చిన్నా, దళిత బహుజన జేఏసీ అధ్యక్షుడు చిలకా బసవయ్యలు సందర్శించి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, రాజధాని అమరావతి ఐక్య కార్యచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకరరావు స్థానిక పలువురు టీడీపీ నేతలు మార్టిన్ శవపేటికను మోసారు. రైతు, దళిత జేఏసీ సభ్యులు, టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు అంతిమ యాత్రలో పాల్గొని మార్టిన్‌కు నివాళి అర్పించారు.

నారాయణాద్రికి రేక్ షేరింగ్ గ్రహణం

● అర్ధరాత్రి దాటాక గుంటూరు వస్తుండటంతో ప్రయాణీకుల పాట్లు



నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ప్రయాణీకులకు గుంటూరు రైల్వేస్టేషన్‌లోనే చూపిస్తోంది. నిత్యం అర్ధరాత్రి దాటాక వస్తుండటంతో ప్రయాణీకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం దూర ప్రాంత రైలు అయిన ముంబై - సికింద్రాబాద్ దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో రేక్‌ని ముడిపెట్టి తరచుగా లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోనే గంటల తరబడి రీషెడ్యూల్ చేస్తోంది. దీంతో ఈ రైలులో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్న యాత్రీకులు సకాలంలో తిరుమల చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. ఎప్పుడైతే సమయపట్టికని మార్పు చేసి రీషెడ్యూలింగ్ చేస్తున్నారో నరసపూర్, చెన్నై, డెల్టా, తిరుపతి నుంచి లింగంపల్లి వెళ్లే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లు ఎదురొస్తుండటంతో క్రాసింగ్ సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ కారణంగా గుంటూరుకు అర్ధరాత్రి ఒంటి గంట దాటాక వస్తుంది. కొన్ని రోజులైతే అర్ధరాత్రి 2 గంటల సమయం దాటిపోతోంది. ఇక తెనాలి తర్వాత మెయిన్‌లైన్‌లోకి ప్రవేశించాక కూడా ఏవైనా రెగ్యులర్ రైళ్లు వస్తే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ని లూప్‌లైన్‌లోకి పెట్టి వాటికి ప్రిసిడెన్స్ ఇచ్చి పంపుతున్నారు. ఈ కారణంగా తిరుపతి వెళ్లేసరికి మరుసటి రోజు ఉదయం 8.30 గంటల సమయం దాటుతుంది. ఈ రైలు దిగి బస్సు ఎక్కి కొండ పైకి చేరుకొనేసరికి 10 గంటల సమయం అవుతుండటంతో ప్రయాణీకులు గదులు తీసుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కి దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో రేక్ షేరింగ్ తొలగించి పాత సమయపట్టిక ప్రకారం నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

చేనేతను కాపాడుకునేందుకు పోరాటాలే శరణ్యం

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



చేనేత కార్మిక సంఘం మహాసభల్లో ప్రసంగిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, జనవరి 21: పాలకుల నిర్లక్ష్యానికి బలవుతున్న చేనేత పరిశ్రమను కాపాడుకునేందుకు పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు అన్నారు. మంగళగిరి తెనాలి రోడ్డులోని మార్కండేయ కల్యాణ మండపంలో జరుగుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సభకు పి.గోవిందు, గొట్టుముక్కల లక్ష్మీ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు చేనేతకు శరాఘాతంగా మారాయన్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు మాట్లాడుతూ తరతరాలుగా చేనేత వృత్తినే నమ్ముకుని బతుకుతున్న నేత కార్మికులు ఉపాధి కోల్పోయి అర్థాకలితో అలమటిస్తూ ఆకలిచావులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ చేనేత కేంద్రాల్లో చేనేత శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇవ్వాలని కోరారు. చేనేత సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో జరగబోయే పోరాటాల్లో కార్మికులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేతివృత్తిదార్ల సంఘం ప్రధాన కార్యదర్శి కే.రామాంజనేయులు, సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల్లో కొప్పురావూరు ఎడ్ల జతకు ప్రథమం



ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజత

దుర్గి, జనవరి 21: మండల కేంద్రమైన దుర్గిలో వేంచేసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నాలుగుపళ్ల ఎడ్ల బండలాగుడు పోటీలు జరిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలో గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్లజత 4,801 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానంలో నిలిచింది. తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లజత 4,759 అడుగులతో రెండోస్థానం, కడప జిల్లా బ్రహ్మంగారి మఠం కేశవాపురానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లజత 4,502 అడుగులతో మూడోస్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం వైకుంఠాపురానికి చెందిన కేశం హుస్సేన్ ఎడ్లజత, నరసరావుపేట మండలం ఇంకుర్తికి చెందిన మాదనబోయిన పోతురాజు యాదవ్ యడ్లజత నాలుగైదు బహుమతులను సంయుక్తంగా పంచుకున్నాయి. గురజాలకు చెందిన జత ఆరోస్థానంలో నిలిచాయి. రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, బండ్ల ప్రసాద్‌లు వ్యవహరించారు. కటకం రామారావు, గండె గోపాలరావులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, జడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ఎంపీపీ యేచూరి సునీతసాయిశంకర్, ఉన్నం పెద్దబ్బాయి, యూత్ నేత యకటీల బుచ్చిబాబు, కటకం చిన వెంకటయ్య, ఊరిబిండి మస్నెయ్య, కొత్తా వెంకటేశ్వర్లు, కటకం శ్రీనివాసరావు, తోట మూర్తి, ఉన్నం చిన్నబ్బాయి, హుస్సేన్, శ్రీనివాసరావు, తోటకూర నాగేశ్వర రావు, సర్పంచ్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



కుంకలగుంటలో మాట్లాడుతున్న టీడీపీ సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ, పక్కన బాజీ చౌదరి

సంఘ సంస్కర్త పేరు పక్కన జగన్ పేరా?

● కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, జనవరి 21: అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన సీఎం జగన్ సంఘ సంస్కర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పక్కన దోపిడీ దారుడైన జగన్ పేరు పెట్టుకోవటం ఎంత వరకు సమంజసమని సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. ఆదివారం పల్నాడు జిల్లా నకరికల్లు మండలం కుంకలగుంటలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు తీవ్ర ద్రోహం చేశారని ఆరోపించారు. అంబేద్కర్ విదేశీ విద్య పేరుతో ఇస్తున్న పథకానికి ఆయన పేరు తొలగించి జగనన్న విద్యా పథకం అని పేరు పెట్టడం అంబేద్కర్‌ను అవమానించటమేనన్నారు. సంఘ సంస్కర్త ఐన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మోదీ ఢిల్లీలో ఏర్పాటు చేశారని, ఎక్కడా ఆయన ఇలా పేరు పెట్టుకోవటానికి తాపత్రయ పడ లేదన్నారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, 20 ఆర్థిక సూత్రాల అమలు కమిటీ మాజీ చైర్మన్ యాళ్ళ శ్రీనివాస శేషశాయిబాబు, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, జవ్వాజి మల్లిఖార్జునరావు, మండల టీడీపీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, తెలుగు రైతు సంఘం నేత గార్లపాటి వెంకటేశ్వర్లు, మాలపాటి మహంకాళి రావు, కనుమూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో ముగిసిన క్రీడోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏపీ ఎస్పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి

పెదకాకాని, జనవరి 21: ఆడుదాం ఆంధ్రలో భాగంగా ఏపీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ, ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న ఏపీఎస్పీఎఫ్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్-2024 ఆదివారంతో ముగిసింది. అందులో భాగంగా 100 మంది ఏపీఎస్పీఎఫ్ సిబ్బంది రెండు రోజులపాటు వాలీబాల్ మరియు షటిల్ బ్యాడ్మింటన్‌లో పాల్గొని తమ సత్తా చాటారు. ముగింపు కార్యక్రమంలో ఏపీఎస్పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి, డైరెక్టర్ రవి ప్రకాష్‌రెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఏపీఎస్పీఎఫ్ విజయవాడ జోనల్ కమాండెంట్ ఎం.శంకరరావు చేతుల మీదుగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు ట్రోఫీలను బహూకరించారు. అసిస్టెంట్ కమాండెంట్లు కె.కృష్ణమూర్తి, బి.శ్రీనివాసరావు, ఎంకేవీఎస్ గుప్తా, ఎస్.శ్రీనివాసరావు, పీవీఎస్ఎన్ మల్లికార్జునరావు, టి.కృష్ణమాచారి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

● 25 నుంచి దశల వారీ ఆందోళనలు

● రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గుంటూరు(విద్య), జనవరి 21: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తోందని, ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఈనెల 25 నుంచి దశలవారీ ఆందోళనలు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం తాలుకా ఆవరణలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా 70, 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పెన్షన్ తగ్గించడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఈనెల 25న తాలుకా కేంద్రాల్లో, 29న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. విజయవాడలో ఫిబ్రవరి 5న రాష్ట్రస్థాయి ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం సలహాదారు కె.దాలినాయుడు, వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభుదాసు, కోశాధికారి టీవీఎస్ఎస్ఆర్‌పి శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే ఆళ్ల



ఆళ్లను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న షర్మిల

మంగళగిరి సిటీ, జనవరి 21: మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆళ్ల మంగళగిరి నుంచి వరుసగా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండుమార్లు గెలిచినా మంత్రి పదవి దక్కకపోవడం, మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడం వంటి కారణాలతోపాటు వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరపున టిక్కెట్టు లేదన్న ప్రచారం నేపథ్యంలో ఆయన ఆయన గతేడాది డిసెంబరులో తన ఎమ్మెల్యే పదవికి స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా సమర్పించారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్న వార్తలతో తాను కూడా షర్మిల వెంటే నడుస్తానని ప్రకటించారు. దీనిలో భాగంగా ఆదివారం విజయవాడలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల ప్రమాణస్వీకారం చేశారు. ఇదే వేదికపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి షర్మిల కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి రూ.2 కోట్ల విరాళం

● చెక్ అందజేసిన డాక్టర్ గోపాలరావు



రూ.2 కోట్ల చెక్ అందజేస్తున్న డాక్టర్ గోపాలరావు, బీనా

గుంటూరు (మెడికల్), జనవరి 21: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చేపట్టిన మాతా శిశు సంక్షేమ కేంద్రం (ఎంసీహెచ్ బ్లాక్) నిర్మాణానికి గుంటూరు వైద్య కళాశాల 1964 బ్యాచ్ పూర్వవిద్యార్థి డాక్టర్ తాతినేని గోపాలరావు(హైదరాబాద్) వ్యక్తిగతంగా రూ.2కోట్ల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందు లో భాగంగా ఆదివారం డాక్టర్ గోపాలరావు, డాక్టర్ బీనా దంపతులు గుంటూరు వచ్చి తాము ప్రకటించిన విరాళంలో కొంత మొత్తాన్ని చెక్ రూపంలో జింకానా కోఆర్డినేటర్ డాక్టర్ బి.బాలభాస్కరరావుకు అందజేశారు. మిగిలిన మొత్తం త్వరలో అందజేస్తామని తెలిపారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి మాజీ సూపరింటెండెంట్, దివంగత డాక్టర్ నూతక్కి వెంకటేశ్వరరావుకు, గోపాలరావు అల్లుడు. డాక్టర్ నూతక్కి పేరిట ఎంసీహెచ్ బ్లాక్‌కు అల్లుడు గోపాలరావు, కుమార్తె బీనా ఈ విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్ బీ చంద్రశేఖరరెడ్డి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్ పరిధిలో.. 13 మంది సీఐల బదిలీ

గుంటూరు, జనవరి 21: గుంటూరు రేంజ్‌లో 13 మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది నెలల్లో రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికార వైసీపీ నేతల సిఫార్సులు, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఆయా బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. కొద్ది నెలల క్రితమే నగరంపాలెం సీఐగా నియమితులైన మల్లికార్జునరావును తాజాగా నరసరావుపేట రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. రేంజ్ పరిధిలో బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి... తెనాలి రూరల్ సర్కిల్‌లో పని చేస్తున్న కె.శ్రీనివాసరెడ్డి స్పెషల్ బ్రాంచ్ బాపట్లకు, బాపట్ల డీటీసీలో పనిచేస్తున్న ఈ.మాల కొండయ్యను గుంటూరు రేంజి వీఆర్‌కు, అదేవిధంగా చిలకలూరిపేట టౌన్ సీఐ సి.సీతారామయ్య గుంటూరు రేంజ్ వీఆర్‌కు, ఎస్.విజయ్ చంద్రను రేంజ్ వీఆర్ నుంచి చిలకలూరిపేట టౌన్‌కు, నగరంపాలెం సీఐ కె.మల్లికార్జునరావును నరసరావుపేట రూరల్ సర్కిల్‌కు, తాడేపల్లి సీఐ ఎ.మల్లికార్జునరావును రేపల్లె రూరల్ సర్కిల్‌కు, కె.వీరాస్వామిని పెదకూరపాడు సర్కిల్ నుంచి పెదకాకానికి, బి.సురేష్ బాబును పెదకాకాని నుంచి రేంజ్ వీఆర్, గుంటూరుకు బదిలీ చేశారు. ఏ సుధాకర్‌ను రేంజ్ వీఆర్, గుంటూరు నుంచి తెనాలి 2వ టౌన్‌కు, ఎస్.వెంకటరావును తెనాలి 2వ టౌన్ నుంచి రేంజ్ వీఆర్‌కు, ఏవీ శివప్రసాద్‌ను కంట్రోల్ రూమ్, గుంటూరు నుంచి వీఆర్‌కు, వి.సూర్యనారాయణను దిశా బాపట్ల నుంచి సైబర్ సెల్, ప్రకాశానికి, పసుపులేటి రామకృష్ణను ఎస్సీ ఎస్టీ సెల్, బాపట్ల నుంచి వేమూరు సర్కిల్‌కు బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెదకాకాని, జనవరి 21: పెదకాకాని సమీపంలోని హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు ఆదివారం పెదకాకాని పోలీసులు తెలిపారు. గుంటూరు పొత్తూరివారితోటకు చెందిన షేక్ బాబర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై భార్య షేక్ రజియా(37), కూతురుతో విజయవాడ వెళుతున్నాడు. మార్గమధ్యలోని కంతేరు అడ్డరోడ్డు సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడ్డారు. లారీ తన భార్య తలపైగా వెళ్లినట్టు, అక్కడికక్కడే ఆమె మృతి చెందినట్టు బాబర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

సత్తెనపల్లి, జనవరి 21: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని 30వ వార్డు వావిలాల ఘాట్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆ వార్డులో నివశిస్తున్న మాటూరి మరియదాసు, అతని భార్య మరియమ్మను డబ్బులు ఇవ్వమని వేధిస్తున్నాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగిన అనంతరం మరియదాసు ఇంట్లో నుంచి బయటకు వెళ్ళాడు. అతను తిరిగి రాత్రి ఇంటికి వచ్చే సరికే ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో మరియమ్మ(45) చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

వైసీపీలో రచ్చకెక్కిన వర్గపోరు

● పార్టీ కార్యాలయ ప్రారంభానికి ఒక వర్గం దూరం

● బలసాని ఎదుటే బాహాబాహీ



ట్రాక్టర్‌పై నుంచే సర్ది చెబుతున్న నల్లమోతు శివరామకృష్ణ, పక్కనే ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్

కాకుమాను, జనవరి 21: వైసీపీలో వర్గపోరు రచ్చకెక్కింది. మండల కేంద్రమైన కాకుమానులో వైసీపీ పార్టీ కార్యాలయాన్ని వైసీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ఆదివారం రాత్రి ప్రారంభించారు. తొలుత గ్రామంలో ర్యాలీ జరిగింది. ఈ క్రమంలో వైసీపీలో ఒక వర్గం యువకులు మరో వర్గం యువకులపై దాడికి దిగారు. అక్కడే ట్రాక్టర్‌పై ఉన్న వైసీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ వారిస్తున్నా యువకుడిపై పిడిగుద్దులు గుద్ది భౌతికదాడి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాటి నుంచి మండలంలో వైసీపీ రెండుగా చీలిపోయింది. నల్లమోతు శివరామకృష్ణకు చెందిన వర్గం ఒక వైపు, ఆయనకు వ్యతిరేకంగా మరో వర్గం ఉంది. ఎమ్మెల్యే సుచరిత ఒక వర్గం నాయకులకు కొమ్ము కాయడంతో ఒక వర్గం వారు సుచరితకు దూరంగా ఉంటూ వచ్చారు. అయితే ఇటీవల సుచరితను తాడికొండ సమన్వయ కర్తగా నియమించినప్పటి నుంచి మండలంలో రెండు వర్గాలు పోటాపోటీగా నూతన సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ను కలసి పరిస్థితులను వివరించారు. అయితే నల్లమోతుకు వ్యతిరేక వర్గం వారు మండలంలో పార్టీ కార్యాలయ ప్రారంభానికి రావాలని కోరినా కిరణ్‌కుమార్ రాకపోవడంతో పాటు తాజాగా ఆదివారం నల్లమోతు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యాలయ ప్రారంభానికి రావడంతో మరో వర్గం వారు దూరం అయ్యారు.

బలసాని కిరణ్‌కుమార్ తొలిసారి కాకుమానుకు రావడంతో బాణా సంచా పేలుళ్లు, తీన్‌మార్ వాయిద్యాలతో పాటు యువకులు బైకులకు సైలెన్సర్ లేకుండా అతి వేగంతో భారీ శబ్దాలు చేసుకుంటూ స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. వచ్చిన వారికి మాంసాహారం పెట్టారు. వారంతా వైష్ణాలయంలోని అరుగులపై కూర్చొని తినడం స్థానికులను ఆశ్చర్యానికి గురి చేసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119, 130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

అరాచక ప్రభుత్వం ఇంటికెళితేనే రాష్ట్రాభివృద్ధి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ


విలేకరులతో మాట్లాడుతున్న నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 21: అరాచక ప్రభుత్వం ఇంటికెళితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమౌతుందని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆదాయం పెరగలేదన్నారు. ఉద్యోగాలు రాలేదన్నారు. మాయమాటలతో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాదుడే బాదుడు అంటూ ప్రజలను పిండేస్తున్నారని విమర్శించారు. చెత్తమీద పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో మిగిలిపోతారన్నారు. పంటకాల్వల్లో నీరుకు బదులుగా రైతుల కన్నీరు పారుతుందన్నారు. కబ్జా చేసినవారికే న్యాయం చేసే ఈ ప్రభుత్వంలో భూరక్షణ చట్టం అమల్లోకి వస్తే ప్రజల భూములు కూడా పోయే ప్రమాదం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. యువతకు 20లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇవ్వటంతోపాటు అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లు పరిష్కరిస్తామని నరేంద్రవర్మ తెలిపారు.

శ్రీకోదండ రామస్వామి ఆలయం నుంచి శోభయాత్ర

పిట్టలవానిపాలెం, జనవరి 21: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామ మందిరం ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా మండలంలోని ఖాజీపాలెం శ్రీకోదండ రామస్వామి ఆలయం నుంచి ఆలయ నిర్వాహకులు శోభయాత్రలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు, శ్రీరామదండు అభిమానులతో కలిసి ఆదివారం జై శ్రీరామ్ నినాదాలతో పిట్టలవానిపాలెం మండలవ్యాప్తంగా ద్విచక్రవాహనాలు, వివిధ వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఖాజీపాలెం నుంచి ప్రారంభమైన శోభయాత్ర మండలంలోని కప్పలవారిపాలెం, పిట్టువారిపాలెం, రెడ్డిపాలెం, భవనం వారిపాలెం, చౌడుపాలెం, కోమలి, సంగుపాలెం, కోడూరు, చందోలు, కుంచలవారిపాలెం మీదగా కొత్తపాలెం, మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం, అల్లూరు, అలకాపురం, అల్లూరురెడ్డిపాలెం, సత్యానారాయణపురం గ్రామాల గుండా తిరిగి ఖాజీపాలెం రామాలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో శ్రీరామ భక్తులు జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ప్రతి దేవాలయంలో, ప్రజలకు అక్షింతలను అందజేశారు.


జైరామ్ నినాదాలతో మండల వ్యాప్తంగా శోభయాత్ర నిర్వహిస్తున్న శ్రీరాముని భక్తులు

భూమి హక్కుల యాజమాన్య చట్టం రద్దు చేయాలి

బాపట్ల, జనవరి 21 : రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా ప్రవేశపెట్టిన భూమిహక్కుల యాజమాన్య చట్టం జీవోనెంబరు 512ను రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా బాపట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం దీక్ష శిబిరాన్ని సందర్శించిన అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన బాపట్లలో న్యాయవాదులు దీక్ష చేస్తున్నారన్నారు. చట్టం రద్దు పర్చాలని ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చేందుకు భూమిహక్కుల యాజమాన్య చట్టంతో ఇబ్బందులపై సామాన్య ప్రజలకు మరింత అవగాహన పెంపొందించేందుకు పోరాటాన్ని గ్రామస్థాయిలో ఈనెల 23 నుంచి చేపట్టనున్నట్లు తెలిపారు. 12వ రోజు దీక్షలో న్యాయవాదులు ఊట్ల రామారావు, ఆతిన వెంకటప్రతాప్, యెనుముల భాస్కర్‌గౌడ్‌లు కూర్చున్నారు. కార్యక్ర మంలో న్యాయవాదులు నందవనం ప్రసాద్, బండిరామ్మూర్తినాయుడు, దుద్దుకూరి శ్రీరామమూర్తి, కోసన వీరశేఖర్, అలపర్తి నాగేశ్వరరావు, డీపీ లీప్, చొప్పకట్ల ఆంజనేయులు, తోటరామాంజనేయులు, సి.రవికుమార్, చల్లాపల్లి రాజు, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అభినందనీయం

● బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు


పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు

బాపట్లటౌన్, జనవరి 21: కళాశాలలోని పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎంతో అభినందనీయమని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక బాపట్ల కాలేజి ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో 1992-1995 డిగ్రీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కళాశాలలో చదువుకున్న విద్యార్థులందరు దేశ,విదేశాలలో ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడ్డారన్నారు. కళాశాలలోని విద్యార్థులకు అన్ని వసతులతో విద్యను కల్పిస్తున్నామన్నారు. ఇటువంటి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవటానికి కళాశాల యాజమాన్యం అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. పూర్వవిద్యార్థులంతా కళాశాలలోని చదువుకునే రోజుల్లో ఆలోచనలను మరొకసారి గుర్తు చేసుకున్నారు. అనంతరం కళాశాల విశ్రాంత అధ్యాపకులు వెంకటసుబ్బారావు, గోరంట్ల శాంతారం, బి.సాంబశివరావు, కళాశాల యాజమాన్యం మానం నాగేశ్వరరావు, ట్రెజరర్ తాళ్ళూరి రామకృష్ణలను దుశ్శాలువా, పూలమాలలతో పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు.

భావపురి రచయితల సంఘం పునఃప్రారంభం హర్షణీయం

● ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, జనవరి 21: భావపురి రచయితల సంఘం పునఃప్రారంభించటం హర్షణీయమని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. 1968వ సంవత్సరంలో అప్పటి ప్రముఖులు ఏర్పాటు చేసిన ఈసంఘం అనేక సాంస్కృతిక కార్యక్రమాలకు, రచనలకు వేదికగా ఉండేదన్నారు. చాలాకాలం తర్వాత పునఃప్రారంభించటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తుతరాలకు మార్గదర్శమౌతుందన్నారు. మంచి ఆలోచనకు శ్రీకారం చుట్టిన వారిని అభినందించారు. కార్యక్రమంలో బీఎస్ నారాయణభట్టు, రమణబాబు, జూలకంటి సత్యనారాయణరాజు ఉన్నారు.


భావపురి రచయితల సంఘం పునఃప్రారంభం బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి తదితరులు

పెన్షన్‌దారులకు దుప్పట్ల పంపిణీ

బాపట్లరూరల్, జనవరి 21: బాపట్ల మండలం మూలపాలెంలో ఆదివా రం పెన్షన్‌దారులకు ఎమ్మెల్యే కోన రఘుపతి దుప్పట్ల పంపిణీ కార్యక్రమా న్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, వైసీపీ నాయకులు వడ్డిముక్కల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, జనవరి 21: మండలంలోని సంగుపాలెం, కోమలి, భవనంవారిపాలెంలలో ఎమ్మెల్యే కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ ఆధ్వర్యంలో కోన చారిటబుల్‌ట్రస్ట్ ద్వారా పెన్షన్ దారులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీ సీ సభ్యులు, వలంటీర్లు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాయకుల తరలింపుపై అంగన్‌వాడీల ఆగ్రహం

● అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో

● ఎస్ఎఫ్ఐ నాయకుల మద్దతు


భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద రహదారిపై రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

భట్టిప్రోలు, జనవరి 21: విజయవాడలో నిరాహార దీక్ష చేస్తున్న యూనియన్ రాష్ట్ర నాయకులను శిబిరం నుంచి తరలించడంపై మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న సమ్మె ఆదివారానికి 41రోజులకు చేరింది. స్థానిక శిబిరం వద్ద భట్టిప్రోలు - వెల్లటూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు. కనీసం వేతనం కోసం తమ పక్షాన పోరాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, కృష్ణా జిల్లా కార్యదర్శి గజలక్ష్మిని బలవంతంగా నిరాహార దీక్ష శిబిరం నుంచి తీసుకువెళ్ళడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి.మనోజ్‌కుమార్ అంగన్‌వాడీల దీక్షకు మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో సూర్యలక్ష్మి, చెల్లమ్మ, రూపారాణి, రత్నకుమారి, దివ్య, కాంతమ్మ, పుష్ప, రజిత, పర్వీన, కామాక్షి, మమత, అంజలి పాల్గొన్నారు.


రేపల్లె సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

కొల్లూరు, జనవరి 21 : కొల్లూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదివారం శిబిరం వద్ద తమ సమ్మెను కొనసాగించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. సమ్మెలో సిఐటియు నాయకులు సుబ్బారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు వనజ, భాగ్యం, సౌభాగ్యలక్ష్మి, అరుణ, బాల, కాశీ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే ఇంటిదోవ తప్పదు

రేపల్లె, జనవరి 21: అంగన్‌వాడీలతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వైసీపీ ప్రభుత్వం ఇంటిదోవ పట్టటం ఖాయమని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. అంగన్‌వాడీలను అణచివేస్తే రాష్ట్రంలో ఉన్నటువంటి మిగిలిన కార్మికవర్గం ఈ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పి ఇంటికి పంపుతారన్నారు. తక్షణమే అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం చర్చలకు పిలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.యూన్సీ, కృష్ణకుమారి, జయప్రద, మేరీమణి, నిర్మలా, పద్మ కుమారి, జ్యోతి, ఆశీర్వాదం, కేవీ లక్ష్మణ్ రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడికత్తి కేసులో కోర్టుకి రావటానికి జగన్‌కు సమయం లేదా?

బాపట్లటౌన్, జనవరి 21: ముఖ్యమంత్రి జగన్‌కు కోడికత్తి కేసులో న్యాయం చేయటానికి సమయం లేదా అని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి ప్రశ్నించారు? ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌కు తన కుమార్తెను చూడటానికి లండన్ వెళ్లటానికి ముఖ్యమంత్రి బాధ్యతలు అడ్డురావుకాని కోడికత్తి కేసులో కోర్టులో హాజరు కావటానికి ఒక్కరోజు కూడా సమయంలేదని గైర్హాజరు కావటం దారణమన్నారు. కోడికత్తి కేసు విచారణ ముందుకు సాగకుండా తన నేరాలను కప్పి పుచ్చుకునే నీచమైన కుట్రలకు ఇది నిదర్శనమన్నారు. దళితులపై ప్రేమ పొంగిపొర్లుతున్నట్లు ప్రతిసభలో డబ్బా కొట్టుకునే సీఎం జగన్ ఒక్కసారి కోర్టుకు వచ్చి కోడి కత్తి కేసులో బెయిల్ వచ్చేటట్లు చేయించకపోవటం అమానుషమన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు


కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గొర్రెపాటి రవీంద్రబాబు

బాపట్ల, జనవరి 21: స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను విజువల్లి చాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్రాధ్యక్షులు గొర్రె పాటి రవీంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అంధులంతా బ్రెయిలీ లిపి నేర్చుకొని ప్రతి ఒక్కరు అభివృద్ధి పథంలో నడవాలని తెలియజేశారు. కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. అంధులకు హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షులు జి.వీరభద్రరావు, వై.నరసింహారావు, ఎం.యానాదిరావు, నటరాజు, ఏవీ మోహనరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, చల్లా రామయ్య, గోగన ఆదిశేషు పాల్గొన్నారు.

సోపాటి జయరావు మృతికి సంతాపం


జయరావు(ఫైల్)

పిట్టలవానిపాలెం, జనవరి 21 : మండలపరిధిలోని సంగుపాలెం గ్రామపంచాయతీకి చెందిన తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి మామగారైన సోపాటి జయరావు (78) ఆదివారం అకాల మర ణం చెందారు. బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ, తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి గృహానికి విచ్చేసి జయరావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబం సభ్యులకు తమప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంగుపాలెం, కోడూరు గ్రామాల, పార్టీ మండల నాయకులు కార్యకర్తలు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన అధికారప్రతినిధిగా మురళీకృష్ణ


మురళీకృష్ణకు నియామకపత్రాన్ని అందజేస్తున్న గాదె వెంకటేశ్వరరావు

బాపట్ల, జనవరి 21: జనసేనపార్టీ బాపట్ల నియోజకవర్గ అధికార ప్రతినిధిగా ఇమ్మడిశెట్టి మురళీకృష్ణను నియమించారు. ఉమ్మడి గుంటూరుజిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణలు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సం దర్భంగా ఆదివారం బాపట్ల జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శివన్నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని తెలుగుదేశంపార్టీశ్రేణులతో కలిసి పనిచేస్తూ రాబోయే ఎన్నికలలో విజయమే ధ్యేయంగా ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాపీ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

కర్లపాలెం, జనవరి 21 : కర్లపాలెం రాజులపాలెంలో తాపీ వర్కర్స్ భవన నిర్మాణానికి యూనియన్ అధ్యక్షుడు పిట్టు కాసులరెడ్డి ఆధ్వర్యంలో ఆది వారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్టు కాసులరెడ్డి మాట్లాడుతూ తాపీ వర్కర్స్ సహకారంతో 3సెంట్లు స్థలం కొనుగోలు చేసి భవన నిర్మాణానికి భూమి పూజలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్.కరీముల్లా, జలీల్, పిట్ల శ్రీనివాసరెడ్డి, అట్ల శ్రీనివాసరెడ్డి, శవనం కోటిరెడ్డి, పులుగు స్వామిరెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, శంషుద్దీన్, అట్ల శ్రీనివాసరెడ్డి, అక్కల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

బాపట్ల,జనవరి 21 : జిల్లాలోని కర్లపాలెం మండలం పేరలి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేసేందుకు ఔత్సాహికులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ పాతూరి సిద్దార్థ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం రెండు ఖాళీలకు యోగాలో పీజీ డిప్లమో లేదా డిప్లమో యోగా చదివిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశించిన క్యాంప్‌లను బట్టి పారితోషికం ఉంటుందన్నారు. దరఖాస్తులను పేరలి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వెంటనే సమర్పించాలన్నారు. వివరాలకు 9848249963 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత లెనిన్ : సీపీఐ

బాపట్ల, జనవరి 21: ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలకు లెనిన్ స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ తెలిపారు. లెనిన్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ 107 సంవత్సరాలకు పూర్వం మానవసమాజాన్ని పట్టి పీడిస్తున్న రాచరికం, వెట్టిచాకిరి, వలస పాలన విధానం, అవిద్య, అంతులేని దోపిడి, దురాక్రమణ వంటి ఆటవిక పాలనా విధానాన్ని అంతం చేయటానికి మార్క్సిజం అనే సిద్ధాంత వెలుగును రష్యాలో ప్రచరింప చేసిన మొదటి సోషలిస్ట్ విప్లవ రాజ్యాస్థాపకుడు లెనిన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి బత్తుల అశోక్, జెల్ది రత్నకుమారి, కార్మికులు పాల్గొన్నారు.

● బాపట్ల, జనవరి 21 : ప్రపంచంలోనే మొట్టమొదటి సామ్యవాద కళ ను 1917లో రష్యాలో సహకారం చేసిన మహానేత లెనిన్ చిరస్మరణీయులని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తెలిపారు. లెనిన్ శతవర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. లెనిన్ పటానికి సీపీఎం నాయకులతో కలిసి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో గంగయ్య మాట్లాడుతూ లెనిన్ మరణించి 100 సంవత్సరాలు కావస్తున్న నేటికి శ్రామిక పీడిత తాడిత ప్రజానీకం లెనిన్ చూపినబాటలో నడుస్తూ తమ హక్కులను సాధించుకుంటున్నారన్నారు. లెనిన్ నేటితరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, సీహెచ్ మజుందార్, నాయకులు తిరుమలశెట్టి శరత్, శామ్యూల్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లెనిన్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తదితరులు

తిరుపతయ్య మృతదేహం ఆచూకీ లభ్యం

అమృతలూరు, జనవరి 21: మండలపరిధిలోని ఇంటూరులో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన బొలిమేర తిరుపతయ్య మృతదేహం అప్పగించాలంటూ కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో బాధితులతో శనివారం రాత్రి వరకు పోలీసు అధికారులు పలుమార్లు చర్చలు జరిపారు. బాధితులు వేసిన టెంట్‌ను పోలీసులు తొలగించి గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. కాగా నిందితుడు చెప్పిన ఆధారంగా కాల్వలో పూడ్చి ఉన్న తిరుపతయ్య మృతదేహంను పోలీసులు గుర్తించినట్లు సమాచారం. శవ పంచనామా నిర్వహించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు.

వెల్లటూరు గీతాజ్ఞాన మందిరంలో హరేరామ అర్ధ ఏకాహం

భట్టిప్రోలు, జనవరి 21: అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలోని వెల్లటూరు గీతాజ్ఞాన మందిరంలో హరేరామ అర్ధ ఏకాహంను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన అర్ధ ఏకాహంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ పరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక హారతిని నిర్వహించారు. గీతాజ్ఞాన మందిరం నిర్వాహకురాలు వేములపల్లి వనజాక్షి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొల్లిపర సాయిశంకర భజన సమాజం కోటిపల్లి, ఐలవరం భజన సమాజాల సభ్యులు పాల్గొన్నారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల స్పర్శ కార్యక్రమాన్ని నిర్వహించా రు. శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ అనంతరం అక్షింతలను కుటుంబ పెద్ద తలమీద వేసుకుని కుటుంబ సభ్యులకు వేయాలని ఫౌండేషన్ రేపల్లె సబ్ డివిజన్ కన్వీనర్ క్రాప రవికుమార్ తెలియజేశారు. సూర్యాస్తమయం తర్వాత గృహాల్లో 5దీపాలు వెలిగించి శ్రీరామ నామాన్ని పఠించాలని చెప్పారు. ప్రతి ఇంటికి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను అందజేశారు.


గీతాజ్ఞాన మందిరంలో హరేరామ సంకీర్తనల్లో పాల్గొన్న భక్తులు

అయోధ్య రాముని అక్షింతలు ఇంటింటికి పంపిణీ

కర్లపాలెం, జనవరి 21 : అయోధ్యలో ఈనెల 22వ తేదీన శ్రీరాముని విగ్ర హం ప్రతిష్ఠించుచున్న సందర్భంగా అయోధ్యం నుంచి వచ్చిన శ్రీరాములవారి అక్షింతలను యాజలి గ్రామంలోని శ్రీకోదం రాయాలంలో, శ్రీఆత్మరామభజన సమాజంలో, గ్రామపెద్దల సమక్షంలో అక్షింతలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో అక్షింతలను, శ్రీరాముని జెండాను ప్రతి ఇంటి కి తిరిగి రామ నామ సంకీర్తనతో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భజన సమాజం సభ్యులు, గ్రామపెద్దలు పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.


అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేస్తున్న భక్తులు

అధికార పార్టీ దుష్ప్రచారం సిగ్గుచేటు

● టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి నాగేశ్వరరావు

బాపట్ల, జనవరి 21: తెలుగుదేశంపార్టీ కోసం నిజాయితీగా పనిచేస్తున్నవారిపై అధికారపార్టీ పత్రిక దుష్ప్రచారం చేయటం సిగ్గుచేటు అని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బడుగు నాగేశ్వరరావు పేర్కొన్నారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టశ్రేణులు అందరిలాగా అమ్ముడుపోయే నాయకులు కాదన్నారు. ఎంతో నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే నాయకత్వంలో తాము పనిచేస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటమికి భయపడి వైసీపీ శ్రేణులు నీచమైన రాతలు రాయిస్తున్నారని విమర్శించారు. బాపట్లలో తెలుగుదేశం బావుటా ఎగురవేయటం ఖాయమన్నారు. రాక్షస పాలనకు చరమగీతం పాడటం తథ్యమన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తే ఉపేక్షించేదిలేదన్నారు. దళితులంతా తెలుగుదేశం పక్షానే పని చేస్తానన్నారు. సమావేశంలో తానికొండ దయాబాబు, వేమవరపు విజయ్, మందపాటి అంద్రేయ, అడే వంశీ, ఐనంపూడి షాలెంరాజు, పసుమర్తి యలమంద, యోహాను, ఏసోబు, మల్లెల రాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బడుగు నాగేశ్వరరావు

కోడి కత్తి శ్రీను తల్లిని పరామర్శించిన మాజీ మంత్రి ఆనందబాబు

వేమూరు, జనవరి 21 : విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కోడి కత్తి శ్రీను తల్లి, అతని సోదరుడిని ఆదివారం మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆయన ధైర్యం చెప్పారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవతోటి నాగరాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జ్యోతిబస్సు, జయపాల్, సమతా సైనిక్‌దళ్ సభ్యు లు, దళిత సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


కోడి కత్తి శ్రీను తల్లిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యురాలిగా లక్ష్మి


గొట్టుముక్కల లక్ష్మి

భట్టిప్రోలు, జనవరి 21 : ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యురాలుగా భట్టిప్రోలుకు చెందిన గొట్టుముక్కల లక్ష్మి ఎన్నికయ్యారు. మంగళగిరిలో జరుగుతున్న 13వ రాష్ట్ర మహాసభల్లో లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించిన చేనేత కార్మిక సంఘం నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. లక్ష్మి నియామకంపై చేనేత నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బాపట్ల ఎస్‌బీ సీఐగా శ్రీనివాసరెడ్డి


కె.శ్రీనివాసరెడ్డి

బాపట్ల, జనవరి 21: బాపట్ల ఎస్‌బీ సీఐగా కె.శ్రీనివాసరెడ్డిని నియమించా రు. తెనాలి రూరల్ సీఐగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు. గతంలో బాపట్ల పట్టణ ఎస్ఐగా, రూరల్ సీఐగా పనిచేసి తెనాలిరూరల్ సీఐ గా బదిలీపై వెళ్లిన ఆయనను తిరిగి ఇక్కడ ఎస్‌బీ సీఐగా నియమించారు. నిబంధనల ప్రకారం అతనిని వేరే చోటకు దాదాపు ఎనిమిది నెలలక్రితం బదిలీ చేశారు. మళ్లీ కీలకమైన ఎస్‌బీ సీఐ పోస్టులోకి అతనిని బాపట్ల జిల్లా కి తీసుకురావటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైభవంగా అనంతభోగేశ్వర స్వామి కళ్యాణ క్రతువు

● అనంతబోగేశ్వరస్వామి ప్రతిష్ఠ వార్షిక మహోత్సవం


కొల్లూరు, జనవరి 21 : అనంత భోగేశ్వర స్వామి ప్రతిష్ఠ వార్షిక మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కొల్లూరులోని అనంతబోగేశ్వర, మల్లేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి 11రకాల ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం అనంతరం స్వామి వారికి సామూహిక శాంతి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం వేద విద్యార్థులతో వేదస్వస్తి జరిపించి సహస్ర దీపాలంకరణ, ఉంజల్ సేవ, హారతి, మంత్రపుష్పం, భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఆయా కార్యక్రమాలను ఆలయ పాలకవర్గ కమిటీ చైర్మన్ యడ్ల వెంకటేశ్వరరావు (పెదబాబు), ఆలయ కార్య నిర్వాహణాధికారి మంతెన అనుపమ, పార్వతీ అమ్మవారి దేవస్థాన బ్రాహ్మణ సంఘ సభ్యులు పర్యవేక్షించారు. సోమవారం రుద్రహోమం, సాయంత్రం రథోత్సవం అనంతరం స్వామివారి ఆలయ ప్రాంగణంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతుందని ఆలయ చైర్మన్ తెలిపారు. అన్నసంతర్పణ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.


సామూహిక శాంతి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పోతురాజు స్వామి కొలుపులు

వేమూరు, జనవరి 21 : మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామంలో నెలకొన్న గ్రామ దేవత పోతురాజు స్వామి వారి వార్షిక కొలుపులు ఉత్సవాన్ని భక్తులు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన కొలుపుల కార్యక్రమంలో శనివారం రాత్రి పోతురాజు స్వామి వారి ఆభరణాలు ప్రతిరూప వస్తువులను కృష్ణానది పాయల వద్దకు తీసుకువెళ్ళి కృష్ణా జలాలతో స్నానం చేయించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం ఉదయం స్వామి వారి విగ్రహాన్ని పసుపు కుంకుమలతో అలంకరించారు. పోతురాజు స్వామిని పసుపు కుంకాలతో ప్రత్యేక రూపాన్ని తయారు చేసి ఆ రూపానికి పొంగళ్ళు, పెరుగు అన్నం కొబ్బరికాయలు కొడుతూ చిందులు వేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్ మృతి


దుర్గాప్రసాద్(ఫైల్)

రేపల్లె, జనవరి 21 : రేపల్లెకి చెందిన రెవెన్యూ ఉద్యోగి దుర్గాప్రసాద్ శనివారం రాత్రి తిరుమల కొండపై గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం మృతదేహాన్ని పట్టణంలోని 20వవార్డులో తన నివాసానికి తరలించారు. కుటుంబసభ్యులు తెలి పిన వివరాల ప్రకారం శుక్రవారం తిరుమల వెంకన్న సన్నిధికి కుటుంబ సభ్యులతో కలసి చేరుకుని స్వామివారికి మొక్కులు తీర్చుకుని కొండపై ఉన్న విశ్రాంత గదిలో నిద్రిస్తున్న సమయంలో బేతపూడి దుర్గాప్రసాద్‌కు(55)తీవ్ర గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. దుర్గాప్రసాద్ మృతికి టీటీడీ బోర్డు సంతాపం ప్రకటించింది. తిరుమల కొండపై నుంచి రేపల్లె నివాసానికి దుర్గాప్రసాద్ మృతదేహాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసింది. ఆయన మృతికి రేపల్లె తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు, సహజ మిత్రులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలి


ప్రచారరథం నుంచి మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, జనవరి 21: రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలని, అదొక్కటే మార్గమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని విజయలక్ష్మీపురంలో ఆదివారం టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలసి బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో గ్రామస్థులను కలిశారు. ఇంటింటికి తిరుగుతూ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజాచైతన్య సదస్సులో భాగంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌరీఅమర్‌నాథ్, గంజి పురుషోత్తమ్, నక్కల వెంకటేశ్వర్లు, పులిమి శివకుమార్, నరాల తిరుపతిరాయుడు, పాకల పాండు, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రాములవారి శోభాయాత్ర

వేటపాలెం(చీరాల), జనవరి 21: వేటపాలెం మండలం అణుమల్లిపేట వేణుగోపాలస్వామి గుడి నుంచి అయోధ్యలో రాములవారి ప్రతిష్ఠలో భాగంగా రాముల వారి శోభయాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు కోడూరు తరుణ్, గొల్లపూడి సీతారామయ్య, కె.మహేష్, హర్షవర్ధనరెడ్డి, ప్రత్తి వెంకటసుబ్బారావు, రామిశెట్టి చైతన్య, రమేష్, ప్రత్తి వెంకటనాగలక్ష్మి, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

చినగంజాం, జనవరి 21: మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసియున్న సీతా లక్ష్మణహనుమత్ సమేత కోదండ రామస్వామి దేవస్థానంలో హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠను పురస్కరించుకొని కోదండరామస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించనున్నారు. చీరాల, వేటపాలెం, పందిళ్ళపల్లి, కడవకుదురు, చినగంజాం, తిమ్మసముద్రం తదితర గ్రామాలకు చెందిన మహిళా భజన బృందాలు నిర్విరామంగా హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. సోవవారం దేవస్థానంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో బాలరాముని ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామకూరు కొండపై రుద్రాభిషేకం

పంగులూరు, జనవరి 21: మండలంలోని రామకూరు కొండపై కొలువుదీరిన గంగా బాలత్రిపురసుందరీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారికి యక్కల వంశస్థులు రుద్రాభిషేకం నిర్వహించారు. తమ వంశదైవమైన రెడంకమ్మతల్లి నెల పొంగళ్ళ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా జరిగిన కార్యక్రమంలో ఒంగోలు మాజీ మున్సిపల్ ఛైర్మన్ యక్కల తులసీరావు, బాల వెంకటసుబ్బయ్య, తిరుమలరావు, కాశీ విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

రావిపూడి ఆశయాలను కొనసాగించాలి


గ్రంథాలను ఆవిష్కరిస్తున్న హేతువాద ప్రముఖులు

ఇంకొల్లు, జనవరి 21: ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన ప్రముఖ హేతువాది రావిపూడి వెంకటాద్రి రాజీలేని రాడికల్ హ్యూమనిస్ట్‌గా జీవించారని భారత హేతువాద సంఘ అధ్యక్షుడు కుర్రా మనుమంతరావు అన్నారు. స్థానిక రాడికల్ హ్యూమనిస్టు సెంటర్‌లో ఆదివారం రావిపూడి వెంకటాద్రి వర్ధంతి సందర్భంగా మేదూరి సత్యనారాయణ అధ్యక్షతన సమస్మరణ సభ జరిగింది. ఈసందర్భంగా పలువురు హేతువాద ప్రముఖులు పాల్గొని రావిపూడి జీవిత చరిత్ర గురించి మాట్లాడారు. రావిపూడి రచనలను అధ్యయనం చేసి ఉద్యమించాలన్నారు. ఆయన సాహిత్యాలతో చైతన్యవంతం కావాలన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని భారతహేతువాద సంఘ ట్రెజరర్ షేక్ బాబు అన్నారు. రావిపూడి భావాలు-ప్రభావాలు, మానవ విజయం, మానవవాద జీవన విధానం గ్రంథాలను ఆవిష్కరించారు.

ఏపీ హేతువాదసంఘ ప్రధానకార్యదర్శి దరియావలి, ట్రెజరర్ కరణం రవీంద్రబాబు, పూర్వ అధ్యక్షుడు చుంచు శేషయ్య, రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ ప్రధానకార్యదర్శి కరి హరిబాబు, యలమందారెడ్డి, కల్యాణం చంద్రశేఖర్, తాటి సుబ్బారావు, బీరం సుందరరావు, రావి నాగేశ్వరి, మేదూరి లక్ష్మీనారాయణ, కుటుంబసభ్యులు, మిత్రులు పాల్గొని రావిపూడికి నివాళులర్పించారు.

ఎస్‌ఈబీ సీఐ, ఎస్ఐ బదిలీ

పర్చూరు, జనవరి 21: పర్చూరు ఎస్‌ఈబీ కార్యాలయంలో పనిచేస్తున్న సీఐ యశోధరాదేవి, ఎస్ఐ శివరామకృష్ణ బదిలీ అయ్యారు. సీఐ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంకు, ఎస్సై నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో అధికారులు బదిలీ అయినట్లు సమాచారం.

గవర్నర్‌ను కలిసిన న్యాయ విద్యార్థి


గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన న్యాయ విద్యార్థి సుఖేష్

అద్దంకిటౌన్, జనవరి 21: విజయవాడలోని రాజ్‌భవనలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను అద్దంకిలోని కాకానిపాలెంకు చెందిన న్యాయ విద్యార్థి సందిరెడ్డి సుఖేష్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వెస్కాన్సిన్ లా పుస్తకాన్ని, వెస్కాన్సిన్ గవర్నర్ ప్యాలెస్ నమూనాను అందజేశారు. సుఖేష్ రాష్ట్ర ప్రభుత్వ విదేశీ విద్యా దీవెన పథకం కింద అమెరికాలోని వెస్కాన్సిన్ యూనివర్శిటీ ఆఫ్ లా కళాశాలలో ఎల్‌ఎల్‌ఎం గ్రాడ్యుయేషన్ చదువుతున్నాడు.

రంగస్థల కళాకారుల అభ్యున్నతికి తోడ్పాటు

అద్దంకిటౌన్, జనవరి 21: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను ఆదివారం విజయవాడలోని తన నివాసంలో ఆ పార్టీ బాపట్ల జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గోవాడ శ్రీకాంత్, అధికార ప్రతినిధి చెబ్రోలు వెంకటసుబ్బయ్య కలిశారు. వైసీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 7 ద్వారా చింతమణి నాటకాన్ని రద్దుచేసి కళాకారులను రోడ్డు పడవేసిందన్నారు. అద్దంకిలో ప్రముఖ్య రంగస్థలం కళారులైన అద్దంకి మణిక్యాలరావు, బండారు రామారావు విగ్రహాలను ప్రతిష్ఠించే బాధ్యతను తాను తీసుకుంటానని వర్ల రామయ్య పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కళాకారుకులకు ఇళ్ల స్థలాలు, 6 వేల రాష్ట్ర ప్రభుత్వ కళాకారుల పెన్షన్ ఇచ్చి వారి అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తామన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి..

- టీడీపీ, జనసేన కలయికతో స్వర్ణ యుగం
- ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేయాలి
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


కొణిదెన గ్రామ టీడీపీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బల్లికురవ, జనవరి 21: టీడీపీ, జనసేన కలయికతో రానున్న రోజుల్లో స్వర్ణ యుగం రానుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం మార్టూరు మండలం జొన్నతాళిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బల్లికురవ మండలం కొణిదెన, గంగపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ నేతలతో మాట్లాడుతూ గ్రామాలలో నేతలు, కార్యకర్తలు సమిష్టిగా ఉంటూ రానున్న రోజుల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఓటర్ల జాబితాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బోగస్ ఓట్లు ఉన్నా, నిజమైన ఓటర్ల ఓట్లు తొలగించినా వెంటనే జాబితాలను తనిఖీ చేసుకొని అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. టీడీపీ మేనిఫెస్టోపై ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించాలన్నారు.

అనంతరం ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఒక వైపు రాష్ట్రం అప్పులకుప్పగా మారిపోతుంటే, వైసీపీ ప్రభుత్వం మాత్రం ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు చెరుకూరి అంజయ్య, యనమాల నాగార్జున, పోలినేని రామయ్య, గుంజి సుబ్బారావు, యిన్నమూరి సత్యం, చిట్టిబోయిన ఏడుకొండలు, కోసనం జగన్నాధం, బండి బాబు, జంద్రాజుపల్లి దేవదాస్, నట్టి అంజకమ్మ, కోడుగడ్డ ఏలేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలి

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఏలూరి సాంబశివరావు

కారంచేడు(పర్చూరు), జనవరి 21: రైతాంగానికి చుక్కనీరు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం కారంచేడు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ అరాచక ప్రభుత్వానికి కాలంచెల్లిపోయే రోజులు దగ్గరపడ్డాయని మండిపడ్డారు. తుపాను ప్రభావంతో నష్టపోయిన ఏఒక్క రైతును ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. అధికార పార్టీ నేతలు ఇసుక, మైనింగ్‌లతో కోట్లకు పడగలెత్తుతున్నారని ఆరోపించారు. జగన్ పాలనకు కాలం చెల్లిందన్నారు. అక్రమ మార్గాన అధికారంలోకి వచ్చేందుకు సీఎం జగన్ నానాపాట్లు పడుతున్నారన్నారు. సొంతపార్టీ నేతలే జగన్‌ను నమ్మే స్థితిలో లేరని చెప్పారు. టీడీపీ, జనసేన పొత్తుతో ఉమ్మడిగా పోదాం, అరాచక ప్రభుత్వాన్ని గద్దెదింపుదాం అని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై తీవ్రభారం పడిందన్నారు. విద్యుత్, ఆర్టీసీ, నిత్యావసర వస్తువుల ధరలుల పదేపదే పెంచి ప్రజలపై పెనుభారం మోపారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక, రంజాన్ తోఫా ఏమయ్యాయని ప్రశ్నించారు. మద్యపాన నిషేధం చేస్తామని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలను తీస్తుందని మండిపడ్డారు. వైసీపీ నేతల వేధింపులతో ఎస్సీలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. భూరక్ష చట్టం అమల్లోకి వస్తే మీ భూములు గోవిందా...గోవిందా అని అన్నారు.

కారంచేడు గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ఏలూరికి ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. తొలుత మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరితో భేటీ అయ్యారు. కొద్దిసేపు అక్కడి నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత బళ్లారి జట్టు


ఫైనల్ పోటీలో తలపడుతున్న బళ్లారి - శ్రీకాకుళం జట్లు

పర్చూరు, జనవరి 21: పర్చూరులోని ఎరీనా క్రికెట్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన జాతీయస్థాయి క్రికెట్ పోటీలలో బళ్ళారి జట్టు విజయం సాధించింది. ఆదివారం శ్రీకాకుళం - బళ్ళారి జట్ల మధ్య ఫైనల్ పోటీ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీకాకుళం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన బళ్ళారి జట్టు 18 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 169 పరుగులు చేసి విజయం సాధించింది. 35 బంతుల్లో 54 పరుగులు చేసి జట్టు విజయానికి కారకుడైన శివరాజ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు. మ్యాన్ ఆఫ్ ది సీరిస్‌గా శ్రీకాకుళంకు చెందిన ప్రసాద్ ఎంపికయ్యారు. మొదటి బహుమతి రూ.3 లక్షలు, రెండో బహుమతి రూ.2లక్షలు, మూడో బహుమతి లక్ష చొప్పున గెలుపొందిన విజేతలకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, అప్పారావు, కోటా శ్రీనివాసరావు, బలరాం, ఉప్పలపాటి అనిల్, రామకృష్ణ, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధానకార్యదర్శిగా మద్దాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు

మేదరమెట్ల, జనవరి 21: ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేదరమెట్లకు చెందిన మద్దాలి సంజీవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలో ఆదివారం జిల్లా ఆర్యవైశ్య సంఘం సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మూడు మండలాల ఆర్యవైశ్య సంఘాలను నేటి నుండి బాపట్ల జిల్లా పరిధిలోకి వచ్చేవిధంగా తీర్మానాలు చేశారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సంజీవరావు మాట్లాడుతూ జిల్లాలో ఆర్యవైశ్యుల ఉన్నతికి కృషి చేస్తానని చెప్పారు.

కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లబోతు వెంకటేశ్వర్లు, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు పెనుగొండ శ్రీను, జిల్లా అధ్యక్షుడు పూనుగుంట శ్రీనివాసరావు, జి.రామారావు, డి.సత్యనారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

యువతి ప్రేమని తిరస్కరించిందని చేతిని కోసుకున్న యువకుడు

అద్దంకి, జనవరి21: యువతి తన ప్రేమని తిరస్కరించిందని యువకుడు చేతిని కోసుకున్న సంఘటన అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన టి.రమేష్ యువతిని ప్రేమించాడు. యువతి ప్రేమను తిరస్కరించటంతో సోమవారం సాయంత్రం భవాని సెంటర్‌లో బ్లేడ్‌తో చేయి కోసుకున్నాడు. రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

అద్దంకి, జనవరి 21: గుండ్లకమ్మ నది నుండి ఇసుక తరలిస్తుండగా పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అద్దంకి పట్టణం సమీపంలోని గుండ్లకమ్మ నది నుండి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఛిద్రమైన రహదారులు

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు


పంగులూరు, చందలూరు మధ్య ఛిద్రమైన రహదారి


జనకవరం నుంచి కొండమంజులూరు వెళ్ళే రోడ్డులో ఏర్పడిన గోతులు

పంగులూరు, జనవరి 21: మండల కేంద్రమైన పంగులూరు నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు ఛిద్రమయ్యాయి. రహదారులకు ఏర్పడిన గోతులపై రాకపోకలు సాగించలేక ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. పంగులూరు నుంచి ముప్పవరం వెళ్ళే ప్రధాన రహదారితో పాటు జనకవరం నుంచి కోటపాడు, కొండమంజులూరు వెళ్ళే రహదారిలో పలు చోట్ల గోతులు ఏర్పడి రాకపోకలు సాగించడం కష్టంగా ఉందని ఆయా గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంగులూరు నుంచి చందలూరు వైపు వెళ్ళే రహదారి గోతులతో పాటు ఎత్తు పల్లాలుగా మారడంతో ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

పంగులూరు నుంచి తూర్పు తక్కెళ్ళపాడు వెళ్ళే రహదారిలో గోతులతో పాటు అడుగడుగునా రహదారి ఎగుడు దిగుడుగా ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. తక్షణ చర్యలు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలి

- సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి


కారంచేడులో అంగన్‌వాడీల నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

కారంచేడు(పర్చూరు), జనవరి 21: అంగన్‌వాడీల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. కారంచేడులోని తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా నిలిచారు. ఆదివారం అంగన్‌వాడీలతో కలసి దీక్షా శిబిరంలో కూర్చొని సంఘీభావం తెలిపారు తెలుగుదేశం పార్టీ అంగన్‌వాడీలకు అండగా నిలుస్తుందని చెప్పారు.. నలభై రోజుల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధ్యతారాహిత్యమన్నారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్

చీరాల, జనవరి 21: ప్రభుత్వ సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక రామకృష్ణాపురంలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం చీరాల సాయిప్యాలెస్ రోడ్డులోని షేక్ ఫాతిమాకు రూ.5.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును వారు అందజేశారు. అలాగే వేటపాలెం మండలం పొల్లరిపాలెంకు చెందిన చప్పిడి శ్రీదేవికి లక్షా 70 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల పక్షపాతిగా ఉందన్నారు. అందుకనుగుణంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రజాప్రయోజనాలలే లక్ష్యంగా చేపడుతున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు గవిని శ్రీనివాసరావు, ధనుంజయ్, అంకాళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక మసీదు సెంటర్లో జరుగుతున్న డ్రైయిన్, రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే బలరాం ఆదివారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులకు చెప్పారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏతరవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు

చీరాలటౌన్, జనవరి 21: అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వన్‌టౌన్ పరిధిలోని దండుబాట రోడ్డులో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఓవ్యక్తి అక్రమంగా ఇంట్లో నిల్వచేసిన 184 క్వార్టర్ సీసాలు, ఓ ఫుల్ బాటిల్ స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు. పత్రాలు సరిగ్గాలేని పది వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా పోలీసులు మాట్లాడుతూ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై వినీల, ఎస్సైలు జనార్దన్, శ్రీనివాసరావు, ఏఎస్సైలు, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

వేమన పద్యాలపై గ్రామాలలో ప్రచారం

బల్లికురవ, జనవరి 21: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో ఆదివారం వేమన జయంతి సందర్భంగా చిలకలూరిపేటకు చెందిన ఇందూ జ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేటితరం ప్రజలకు వేమన పద్యాల గురించి తెలియజేసేందుకు అన్ని గ్రామాలలో ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. వేమన సాక్షాత్తు దేవుడే అని, అందుకే అయనను వేమన భగవాన్ అని పిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు, రామాంజనేయులు, వెంకట్రామిరెడ్డి, గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యమ్మ, పుల్లయ్య, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలు అవశ్యం

చీరాల, జనవరి 21: సిద్ధాంతపరమైన పోరాటాలతో ప్రగతి సాధ్యమని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం లెనిన్, నూతి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్య పోరాటాలు అవశ్యమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, సీపీఐ నాయకులు మేడా వెంకట్రావు చిరుమల ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, కె.వీరాంజనేయులు, ఎస్.రాజశేఖర్, అచ్యుతిని బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆశ్రమంలో రామ్మూర్తి జయంతి

మార్టూరు, జనవరి 21: స్థానిక అమ్మ ఆశ్రమంలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ, స్వర్గీయ గానాల రామ్మూర్తి జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యానశాఖ జాయింట్ డైరెక్టర్ పావులూరి హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు మచ్చా అనంతాచారి, కొండముది రఘు, మల్లికార్జున, వంగవోలు బ్రహ్మం, ఉండవల్లి కృష్ణమూర్తి, గుంటుపల్లి చందు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మైనార్టీ సెల్ కార్యవర్గం

ఇంకొల్లు, జనవరి 21: తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ఇంకొల్లు మండల నూతన కమిటీని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆమోదించగా, మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు వారి పేర్లు ప్రకటించారు. మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఇంకొల్లుకు చెందిన షేక్ బాబర్‌బాషా, కార్యదర్శిగా షేక్ బాజి, ఉపాధ్యక్షులుగా షేక్ వలి, ఇడుపులపాడుకు చెందిన షేక్ మహబూబ్ సుభాని, ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా కీదరవలి, సూరజ్, ఖాసీం, కార్యదర్శులుగా షేక్ మోదిన్, కరిముల్లా, కార్యవర్గసభ్యులుగా సయ్యద్ కరిముల్లా, పటాన్ బాజీ, ఇసుబ్, షేక్ కాలేషా ఎన్నికయ్యారు. ఇంకొల్లు పట్టణ మైనార్టీసెల్ అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ మీరావలి, షేక్ మస్తాన్‌వలి, ఉపాధ్యక్షులుగా షేక్ ఖాజీవలి, షేక్ సుభాని ఎన్నికయ్యారు.

జనసేన ఎన్నికల సెంట్రల్ కమిటీ కన్వీనర్‌గా అనిల్‌కుమార్



పర్చూరు, జనవరి 21: జనసేన పార్టీ ఎన్నికల సెంట్రల్ కమిటీ కన్వీనర్‌గా పర్చూరుకు చెందిన ఆలా అనిల్‌కుమార్‌ను ఆపార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నియమించటం పట్ల జనసేనులు హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పవన్ కల్యాణ్‌కు అభినందలు తెలిపారు. పార్టీలో తమకు అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా నిర్వహించి టీడీపీ, జనసేన పొత్తుతో అధికార వైసీపీని గద్దెదించేలా కృషిచేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన జనసేనులు నాగేంద్రబాబు, నాదెండ్ల మనోహర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ హెల్పర్ మృతి

అద్దంకిటౌన్, జనవరి 21: గత పదిరోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ హెల్పర్ ఆదివారం మృతి చెందారు. అద్దంకి పట్టణంలోని పసుమర్తిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తున్న తెల్ల సుబ్బులు(55) పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అద్దంకిలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సపొందుతూ మృతిచెందారు. మృతదేహాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జి.శారద, కార్యకర్తలు మనోలత, పార్వతి, చంద్రమతి, రమాదేవి, పలువురు ఆయాలు సందర్శించి నివాళులర్పించారు.

కాగా, తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 41వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి నిరసన తెలిపారు.

చికిత్స పొందుతూ అర్చకుడు మృతి

పర్చూరు, జనవరి 21: రోడ్డు ప్రమాదంతో గాయపడి చికిత్స పొందుతూ అర్చకుడు శనివారం రాత్రి మృతి చెందాడు. ఇంకొల్లు మండలం గంగవరం గ్రామానికి చెందిన సోమరాజుపల్లి షణ్ముఖ సదాశివశాస్త్రి(18) పర్చూరులోని శ్రీసాయిబాబ ఆలయంతోపాటు, స్థానిక వైజంక్షన్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయాల్లో అర్చకునిగా పనిచేస్తున్నాడు. ఈనెల 16న తన స్వగ్రామానికి బైక్‌పై వెళుతూ జాగర్లమూడి అడ్డరోడ్డు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు.

దేగరమూడిలో ఏలూరి ఫ్లెక్సీ చించివేత

మార్టూరు, జనవరి 21: మండలంలోని దేగరమూడి గ్రామంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫ్లెక్సీని చించివేశారు. నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ పార్టీ కార్యకర్తలు ఏలూరి, పవన్ కల్యాణ్ బొమ్మలతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని చించిచేశారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఎలాంటి గొడవలకు తాము కారకులు కాకూడదనే కారణంగా ఫ్లెక్సీని చించి వేసినప్పటికీ కార్యకర్తలు మౌనంగా ఉన్నారని గ్రామంలోని టీడీపీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు.